తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ఘనంగా మంత్రి రోజా పుట్టిన రోజు వేడుకలు

నగరి, నవంబరు 17 ప్రభాతవార్త: మంత్రి రోజా పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం మిన్నంటాయి. నగరి, పుత్తూరు మార్గమధ్యంలోని జీవీఆర్ కన్వెన్షన్ హాలు పుట్టిన రోడ్డు వేడుకలకు వినూత్నంగా ముస్తాబైంది. కల్యాణ మండపం ప్రాంగణం మంత్రికి ఆహ్వానం పలికే ఫ్లెక్సీలతోను, పార్టీ పతాకాలతోను కలకలలాడింది. మండపానికి హాజరయ్యే నాయకులు, కార్యకర్తలను కళాకారుల కోలాటాలు, డప్పు వాయిద్యాలు స్వాగతం పలికాయి. సభావేదిక వద్దకు హాజరైన వారిని అక్కడ ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు మంత్ర ముగ్దులను చేసి కుర్చీలకు బంధించింది. కొయంబత్తూరు నుంచి వచ్చిన గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన నాట్య కారిణి అనుష చేసిన



నగరిలో ఘనంగా మంత్రి పుట్టిన రోడ్డు వేడుకలు

నెమళి నాట్యం, పాటలు, జబర్దస్త్ నటులు రాకేష్, వర్ష వంటి వారు చేసి హాస్యాలు, ఢీ ఫేం కళాకారులు చేసినృత్యాలు, జానపద నృత్యాలు, గాయకుడు మనో పాడిన సినీ పాటలు, వైసీపీ గీతాలు అంటూ ఒకదాన్ని మించేలా ఒక కార్య క్రమం అంటూ వేడుకలకు విచ్చేసిన వారికి కనువిందు చేసింది. ఆమె జీవితంపై ముద్రించిన పుస్తకాన్ని టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆవిష్కరించారు. సభావేదిక వద్దకు విచ్చేసిన మంత్రి రోజా సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించిన అనంతరం పుట్టిన రోజు కేక్‌ను కత్తిరించి అందరికి పంచారు.

## సకలదేవతా పరివారంతో...
# రథోత్సవంపై అలిమేలుమంగ

తిరుపతి/తిరుచానూరు, నవంబర్17ప్రభాతవార్త: అమ్మలగన్నఅమ్మ తిరుచానూరు అలిమేలుమంగ కార్తీక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం సకలదేవతాపరివారంతో వైభవోపేతంగా తిరువీధులలో



దివ్యరథం అధిరోహించి భక్తులను కటాక్షించారు. ఉదయం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత పద్మావతి అమ్మవారి ఉత్స వమూర్తిని బంగారుగొడుగు అమర్చిన మహోన్న రథంపై అధిరోహి ంపజేశారు. అర్చకులు కర్పూర హారతులిచ్చి ఆలయ నాలుగుమాఢ వీధుల్లో సాగింది. రథంముందు భక్తులు గోవిందా... పద్మావతిదేవినమ: అంటూ నామస్మరణలతో స్వయంగా ఈ రథాన్నిలాగి భక్తి పారవశ్యంతో పునీతులయ్యారు. ఆలయ మాఢ వీధులలో రథోత్స వంలో ఎలాంటి అపశృతులు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి, జెఈఓలు సదాభార్గవి, వీంబ్రహ్మం, సిఇ నాగేశ్వర రావు, తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వరరెడ్డి గట్టి భద్రతా చర్యలు తీసుకున్నారు. పెద్ద జీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యేడాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి ,జెఈఓ వీరబ్రహ్మం దంపతులు,ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఈఈలు నరసింహమూర్తి, మనోహర్, విజిఒ బాలిరెడ్డి, ఎఈఓ రమేశ్ ,భక్తులు,అర్చకులులు పాల్గొన్నారు.

# 21న మాంబట్టు మార్గంలో ముఖ్యమంత్రి పర్యటన

**- నాడు తండ్రి, నేడు తనయుడు ఒకేచోట నుంచి ప్రసంగాలు - పులికాట్ సరస్సు పూడికతీతతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం - ఉప ముఖ్యమంత్రి, మంత్రులు స్థల పరిశీలన**

తడ, నవంబర్ 17 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా తడ మండలం మాంబట్టు పారిశ్రామికవాడ వద్ద ఈ నెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటిస్తున్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా పులికాట్ సరస్సు పూడిక తీత పనులకు ఆయన అంకురార్పణ చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన, సభ నిర్వహణ తదితర అంశాల మీద ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కె.నారాయణస్వామి, రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులతో



మాంబట్టు మార్గంలో సిఎం జగన్ పర్యటన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రులు

కలిసి సీఎం పర్యటన, హెలిప్యాడ్, బహిరంగ సభ వేదిక, పార్కింగ్ స్థలాలను ఎంపిక చేశారు. తడ మండలం మాంబట్టు సమీపంలోని అపాచి పరిశ్రమ మార్గంలో కాదలూరు, మాంబట్టుల మధ్య స్థలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. మొదట సూళ్లూరుపేటలోని పలు ప్రాంతాలను పరిశీలించినప్పటికీ చివరికి మాంబట్టు పారిశ్రామికవాడ సమీపంలోనే సభ నిర్వహణ మంచిదని నిర్ణయించారు. అక్కడ శరవేగంతో పనులు ప్రారంభించారు. ఇప్పటికే అక్కడి ప్రదేశాన్ని చదును చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా జన సమీకరణ చేపట్టే పనులు మొదలయ్యాయి. ఈ సందర్భ ంగా ఉప ముఖ్యమంత్రి, మంత్రి మాట్లాడుతూ సీఎం పర్యటనకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు నిర్వహించా లన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రపంచ మత్స్యకార దినోత్స వాన్ని జాలర్లు ఎక్కువగా ఉండే తడ ప్రాంతంలో నిర్వహిస్తుండటం విశేషం. ముఖ్యమంత్రిగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సరిగ్గా అపాచి పరిశ్రమ వద్దనే బహిరంగ సభలో పాల్గొని ఉన్నారు. అక్కడ షూ తయారీ కేంద్రం ప్రారంభోత్స వంలో పాల్గొనడమే కాకుండా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. ప్రస్తుతం తడ మండలంలోని వేలాది మంది మత్స్యకారులకు ఉపయోగపడేలా సువిశాలమైన పులికాట్ సరస్సులో ఎండాకాలం సైతం నీళ్ల ఉండేలా పూడిక తీత పనులకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవ తీసుకొని నిధులు మంజూరు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో జగన్ ఈ ప్రాంతానికి రావడం ఇదే తొలిసారి కావడం విశేషం. శుక్రవారం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ, ఎస్పీ పరమేశ్వరరెడ్డితో పాటు తిరుపతి పార్లమెంటు సభ్యుడు మద్దెల గురుమూర్తి, సూళ్లూరుపేట, సత్యవేడు ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, కోనేటి ఆదిమూలం, ఎంఎల్‌సిలు మేరిగ మురళీధర్, బల్లి కల్యాణ చక్రవర్తి, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్ మెంట్ బోర్డు ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, స్థానిక అధికారులు, అధికార పార్టీ నాయకులు, మత్స్యకార నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ సభావేదిక వద్ద ఫొటో ఎగ్జిబిషన్, ముఖ్యమంత్రితో గ్రూప్ ఫొటో ఏర్పాటు కళాజాత, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సభా ప్రాంగణంలో సీటింగ్ ఏర్పాట్లు, మంచినీటి వసతి, ప్రజలు కూర్చొనే ఎన్‌క్లోజర్లు, వాటి మేనేజ్‌మెంట్, వాటికి స్టిక్కరింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు, ఎల్ఇడి బ్యాక్‌డ్రాప్, నిరంతర విద్యుత్ సరఫరా, స్టాండ్‌బై జనరేషన్ ఏర్పాటు, మొబలైజేషన్, శానిటేషన్, మెడికల్ క్యాంపుల ఏర్పాటు, అంబులెన్స్, 108, శిలాఫలకాలు తదితర ఏర్పాట్లపై విధులు కేటాయించబడిన అధికారులు ఎటువంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసుశాఖ తరపున జిల్లా ఎస్పీ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పలువురు ఆర్డీఓలు, జిల్లా స్థాయి అధికారులు కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు.

# పంచమీతీర్థానికి సర్వం సిద్ధం

**-25వేలమంది భక్తులకు విశ్రాంతి కేంద్రాలు-భక్తులకు అన్నప్రసాదాలు,తాగునీరు,టీ,కాఫీ**



పద్మపుష్కరిణి

తిరుపతి/తిరుచానూరు, నవంబర్17 ప్రభాతవార్త: పద్మావతి అమ్మవారి కార్తీకబ్రహ్మోత్స వాల ముగింపు ఘట్టంలో అత్యంత విశిష్టమైన చివరగా నేటి ఉదయం జరిగే పంచమీతీర్థంకు సకల ఏర్పాట్లు సిద్ధం చేశారు. పంచమీతీర్థానికి భక్తులు విశేషంగా విచ్చేయనున్నందున టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈఓ ఏవి ధర్మారెడ్డి, జెఈఓ వీరబ్రహ్మం ప్రత్యక్ష పర్యవేక్షణలో టిటిడి పెద్దఎత్తున ఏర్పాట్లుచేసింది. అమ్మవారి పవిత్ర పుష్కరిణిలో పవిత్ర స్నానం చేసేందుకు వీలుగా అన్ని జాగ్రత్తలు తీసుకుంది. 25వేలమంది భక్తులు సేదదీరేలా జర్మన్‌షెడ్లు ఏర్పాటుచేసి శుక్రవారం రాత్రి నుండే అన్నప్రసాదాలు, తాగునీరు, తేనీరు అందిస్తున్నారు. టిటిడి సిఈ నాగేశ్వరరావు పర్యవేక్షణలో పుష్కరిణిలోకి భక్తులు సాఫీగా వెళ్ళేందుకు అవసరమైన క్యూలైన్లు, బారికేడ్లు, పద్మపుష్కరిణిలోకి ప్రవేశ,నిష్క్రమణ గేట్లు, సూచికబోర్డులు ఏర్పాటు చేశారు. భద్రత పరంగా, అన్నప్రసాద కౌంటర్లు, వైద్యం, పార్కింగ్ తదితరాలన్నీ పటిష్టంగా ఏర్పాటుచేశారు. వెయ్యిమంది శ్రీవారిసేవకులు శుక్రవారం సాయంత్రం నుండే వివిధ ప్రాంతాల్లో సేవలందిస్తున్నారు. పుష్కరిణిలో నేటి మధ్యాహ్నం 12గంటల నుండి 12.10 గంటల మధ్య చక్రస్నానం కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. భక్తులు సంయమనంలో వ్యవహరించి రోజంతా పుణ్యస్నానాలు ఆచరించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

## పెద్దశేషునిపై శ్రీమన్నారాయణుడు

**-నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో తొలివాహనం ఆరంభం**

తిరుమల,అక్టోర్ 15ప్రభాతవార్తప్రతినిధి: దేవలోకం వైకుంఠంలో ఆదిశేషుని శేషతల్పంపై కొలువు దీరిన వైనాన్ని గుర్తుచేస్తూ కలియుగవైకుంఠం తిరుమలలో నవరాత్రి బ్రహ్మోత్స వాల్లో శ్రీమహావిష్ణువు అలంకారంలో శ్రీమన్నారాయణుడు ఏడుతలల పెద్దశేషునిపై భక్తులను కటాక్షించాడు. దేవదేవుని నవరాత్రి బ్రహ్మోత్స వాల్లో భాగంగా మొదటిరోజు ఆదివారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి ఏడుతలల స్వర్ణ శేషవాహనంపై తిరుమాడ వీధులలో విహరించారు. వాహనం ముందు గజరాజులు, అశ్వాలు ఠీవిగా నడుస్తుండగా భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించారు. రాత్రి 7గంటలకు వాహనమండపం వద్దనుండి ఆరంభమైన స్వామివారి వాహనసేవ అత్యంత రమణీయంగా జసాగింది. ఈ కార్యక్రమంలో వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి దంపతులు, పాలకమండలి సభ్యుడు సుబ్బరాజు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ శ్రీహరి, ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, సివిఎస్ఒ నరసింహకిశోర్, విఎస్ఒలు గిరిధర్, బాలిరెడ్డి, ఆలయ ఏవిఎస్ఒ మనోహర్,అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## గతం గుర్తు చేసుకుందాం...
# చంద్రబాబు రుణం తీర్చుకుందాం!

**-రేపటి నుంచి కుప్పంలో తెదేపా కార్యక్రమం**
**-దశ..దిశమార్చే బాబుకు మద్దతు పలకాలి !! -ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్**



కుప్పం, నవంబర్ 17 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గంలో ఈనెల 19వతేది నుంచి గతం గుర్తు చేసుకుందాం..బాబు రుణం తీర్చుకుందాం కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ప్రకటించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 19న రామకుప్పం మండలం పంద్యాలమడుగులో ఈ కార్యక్రమం మొదలవుతుందన్నారు. కుప్పం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం చేపడ్తామన్నారు. సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామనా న్నరు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారంకు కృషి చేస్తామన్నారు. కుప్పం ప్రజలు కూడా రాష్ట్ర దశ,దిశమార్చే చంద్రబాబుకు మద్దతు పలకాలని కుప్పం ప్రజలు ఓటేసేది ముఖ్యమంత్రికి అన్నారు. కుప్పంలో ఓడిపోయే అభ్యర్థికి ఓట్లు వేసి వృధా చేసుకోరాదన్నారు. కుప్పం అభివృద్ధి ప్రదాత చంద్రబాబేనని ఈసారి ఎన్నికల్లో బాబుకు లక్ష మెజార్టీ సాధనకు కృషి చేస్తున్నామన్నారు. 35ఏళ్లుగా కుప్పంలో చంద్రబాబు చేసిన అభివృద్ధిని ప్రజలకు గుర్తు చేస్తామన్నారు. కుప్పంలో చంద్రబాబు రాకముందు, వచ్చిన తర్వాత పరిస్థితులను తెలియజేస్తూ గ్రామాల్లో బోర్డులు ఏర్పాటుచేస్తామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి ట్యాంకులు, పాఠశాలలు, కాలేజ్‌ల ఏర్పాటు చేశారన్నారు. అలాగే దేశంలోనే తొలిసారి ఇజ్రాయిల్ టెక్నాలజీ అందుబాటులో తెచ్చి రైతులు ఉద్యానవన పంటలు సాగు చేసేలా చొరవ చూపారన్నారు. నేడు కుప్పం నుంచి పూలు, కూరగాయలు దేశ విదేశాలకు ఎగమతులు అవుతున్నాయన్నారు. పాడి పరిశ్రమను ప్రోత్స హించడంతో పలు కుటుంబాలు ఆర్థికంగా బాగుపడ్డాయన్నారు. కెజి టు పిజి వరకు ఇక్కడ విద్యాసంస్థలు ఏర్పాటయ్యేలా చూశారన్నారు. పరి శ్రమలు తెచ్చి వేలాదిమందికి ఉపాధికల్పిస్తున్నారన్నారు. తెదేపా హయాంలో హంద్రీ-నీవా పనులు తొంభైశాతం పూర్తయ్యాయని కోర్టు కేసులు లేకుండా ఉంటే గతంలోనే తామే పనులు పూర్తి చేసేవారమన్నారు. రైతుల పంటల ఎగుమతుల కోసం 600 ఎకరాల్లో కార్గో ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటుచేయాలని చూశారని అయితే ప్రభుత్వం మారాక అడుగుముందుకుపడలేదన్నారు. కుప్పంలో చంద్రబాబు చేసిన అభివృద్ధి గ్రామాల్లోని శిలాఫలకాలే చెబుతాయన్నారు. చంద్రబాబును అక్రమ అరెస్ట్ చేస్తే 127 దేశాల్లో ప్రజలు ర్యాలీలు, నిరసనలు చేపట్టడం చంద్రబాబుకు ఉన్న ప్రజాదరణకు ఉదాహరణ అన్నారు. చంద్రబాబు దళితులు, మైనార్టీలు, బిసిలకు కీలకపదవుల్లో కూర్చోబెట్టిన మహానేత అన్నారు. మరలా చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని కుప్పంలో గతాన్ని మించిన అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, రాష్ట్ర బిసిసెల్ ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, జిల్లా నేత రాజగోపాల్, తెలుగుయువత అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కంటికిరెప్పలా కాపాడేది జగన్ ప్రభుత్వమే

**- చిత్తూరు ఎం.పి. రెడ్డెప్ప - లంచాలు.. దళారులు లేకుండా పథకాలు ప్రజలకే !!**



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్.పక్కన ఎంపి రెడ్డెప్ప

శాంతిపురం, నవంబర్ 17 ప్రభాతవార్త : ప్రజలను కంటికి రెప్పలా కాపాడేది సిఎం జగన్ ప్రభుత్వమేనని చిత్తూరు ఎం.పి. రెడ్డెప్ప పేర్కొన్నారు. గుంజార్ల పల్లిలో రాష్ట్రానికి జగనే ఎందుకు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. లంచాలు, దళారులు పథకాలు నేరుగా వాలంటీర్ల ద్వారా అందిస్తున్నామన్నారు. వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల సేవలు అమోఘమన్నారు. సిఎం జగన్ ఆడవారినే నమ్ముకున్నారని మహిళల గౌరవాన్ని పెంచుతున్నార న్నారు. తాను చంద్రబాబుకలసి చదువుకున్నామని తనకు కూడా 45 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందన్నారు. మరలా జగన్ సిఎం అయితే పిల్లల భవిష్యత్తు బాగుపడుతుందన్నారు. త్వరలోనే హంద్రీ-నీవా జలాలు వస్తాయన్నారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ సిఎం జగన్‌ది అన్నంపెట్టిన చెయ్యి అని ప్రజలు దాన్నే నమ్ముకుందామని కోరారు. మోసం చేసేవారిని నమ్మవద్దన్నారు. 2014లో అధికారంలో వచ్చేందుకు చంద్రబాబు ఎన్నో అబద్ధాలు చెప్పి ప్రజలకు ఎటిఎం కార్డులిచ్చి మోసగించారన్నారు. చంద్రబాబు జైలుకి వెళ్లివచ్చారని ఇక దేశం నేతలు ప్రజలకు ఇంకేం గ్యారెంటీ ఇస్తారని వ్యాఖ్యలు చేశారు. తాము ఐదేళ్లలో ఏం చేశామో ప్రజలకు చెప్పి ఓట్లు అడుగుతున్నా మన్నారు. ప్రజలు సిఎం జగన్‌ను ఆదరించి కుప్పం ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, కనీ ్వనర్ దండపాణి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## భూపాలచెట్టు కాయలు తిని 15 మంది విద్యార్థులకు అస్వస్థత



చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

తవణంపల్లె, నవంబర్ 17 ప్రభాతవార్త: పాఠశాలకు వెళ్ళి తిరిగి ఇంటికి వెళుతూ దారిలో వున్న గుర్తు తెలియని కాయలను తిని సుమారు 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన సంఘటన మండలంలోని టి.పుత్తూరు వడ్డిపల్లెలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. టి.పుత్తూరు వడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో 36 మంది విద్యార్థులు వున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం సాయంత్రం పాఠశాల వదిలిపెట్టడంతో పిల్లలందరూ తమ తమ ఇళ్ళకు బయలు దేరారు. ఇందులో కొంత మంది ఇళ్ళకు వెళుతూ దారిలో వున్న భూపాలచెట్టు కాయలను కోసి తిన్నారు. దీనితో వీరు కొద్ది సేపట్టి అస్తస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పిల్లల తల్లిదండ్రులు వెంటనే పిల్లలను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు దేవేంద్ర, చరణ్, రజని, సోము, సానే, చిత్ర, పవన్, నితిన్, కార్తీక్, లోహిత్, లాస్య, దర్శిని, ఎన్.చరణ్‌లు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో ఒకరిద్దరు పిల్లలు ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిస్తోంది. విషయం తెలుసుకున్న వెంటనే మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తమ సిబ్బందితో కలసి ఆస్పత్రికి వెళ్ళి పరిస్థితిని సమీక్షించారు. అలాగే ఎంఈఓ హేమలత పాఠశాల హెచ్‌ఎంను ఆస్పత్రికి పంపి విదార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

## సచివాలయ వ్యవస్థపై కేంద్రం బృందం కితాబు

తిరుపతిరూరల్, నవంబర్17 ప్రభాతవార్త: ఆంధ్ర రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ పనితీరు అద్భుతంగా ఉందని కేంద్ర బృందం కొనియాడింది. క్షేత్ర స్థాయిలో గ్రామీణుల జీవన విధానం మెరుగుపరిచేందుకు చేపట్టాల్సి న చర్యలపై పరిశీలించేందుకు జాతీయ సహజవనరులశాఖకు చెందిన శుభం జాన్‌గ్రా, జౌళి శాఖకు చెందిన హరీష్ విహల్ది, ఇండస్ట్రీ కామర్స్ డిపార్టు మెంట్‌కు చెందిన దంబీర్‌యాదవ్, పెట్రోలియం శాఖకు చెందిన రాహుల్ జైన్‌లతో కూడిన ఐదుగురు యువ అధికారుల బృందం రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం తిరుపతిరూరల్ మండల పరిధిలోని పెరుమాళ్ళపల్లి గ్రామ సచివాలయం, ఎస్‌డబ్లుపిఎస్ సెంటర్, తనపల్లి పంచాయతీలోని రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, సచివాలయం, స్త్రీ శక్తి భవన్‌లను సందర్శించారు. ఈ వ్యవస్థ వల్ల క్షేత్రస్థాయిలో పేదలకు అందుతున్న సేవలపై కేంద్ర మానవరుల శాఖకు ప్రత్యేక నివేదిక ఇవ్వనున్నట్లు కేంద్రం బృందం తెలిపింది. పల్లె ప్రజలు శుభ్రత-పరిశుభ్రతపై అవగాహన పెంచుకుని స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని వైబ్రాండ్ గ్రామాలుగా తీర్చిదిద్దే యజ్ఞంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ డిఎల్‌పిఓ రూపరాణి, ఈవోపిఆర్డీఓ గిరిధర్‌రెడ్డి, ఈవో మదుసూధన్‌రావు, పెరుమాళ్ళపల్లి సర్పంచ్ జోగి మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌చార్జిల పాలనతో సుపరిపాలన సాధ్యమా?

## కనకదుర్గగుడి ఇఓకు బాధ్యత

శ్రీకాళహస్తి,నవంబర్ 17 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి గత కొన్ని సంవత్స రాలుగా ప్రభుత్వం ఇన్‌చార్జిలను నియమించటంవల్ల అభివృద్ధి ఆశించినంతగా ముందుకు సాగటం లేదు. అంతేకాక ఇక్కడ ఎఫ్ఏసిలుగా నియమిస్తున్న అధికారులకు వారి పేరెంట్ సంస్థ పని భారమే అధికం. ఇప్పటి వరకు పని చేసిన ఇన్‌చార్జి అధికారి ఆర్‌జెసి అంటే ఆయన 7జిల్లాలకు ఇన్‌చార్జి. దాంతో ఆయన ఇక్కడ ఎక్కువ కాలం దృష్టి సారించలేక పోయారు. ఇక ఆలయంలో పరిపాలన ఎలా ఉన్నా దళారుల సామ్రాజ్యంగా మారింది. గతంలో ఎంతో మంచిపేరు ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల దందాలు అధికమయ్యాయి. అంతేకాక ఆలయంలో దళారి వ్యవస్థ గురించి ఎన్నో విమర్శలు వస్తున్నా ఇక్కడి పాలకులు కానీ అధికారులు పట్టించుకోలేదు. దాంతో దళారిల వ్యవస్థ విచ్చల విడిగా మారింది. బహిరంగా 'ప్యాకేజిలు' మాట్లాడుకొని వ్యాపారం సాగించారు. అంతేకాక ఇక్కడ అధికారికి పాలక మండలికి సఖ్యత, సమన్వయం లేకపోవటంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



శ్రీకాళహస్తి పరిపాలనా భవనాలు

**ఇన్‌చార్జిలతో సుపరిపాలన సాధ్యమా?**

ప్రస్తుతం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విజయవాడ దుర్గామల్లేశ్వరాలయంలో ఇఓగా పనిచేస్తున్న కె.యస్ రామారావుకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ దేవాదాయశాఖ ఉత్తర్వులు జారి చేసింది. అక్కడ వందల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తే ఎలా పర్యవేక్షించగలరో ఉన్నతాధికారులకు, పాలకులకే తెలియాలి. శ్రీకాళహస్తి నుంచి విజయవాడ సుమారు 400 కిలో మీటర్ల దూరం. ఒకవేళ శ్రీకాళహస్తి నుంచి ఫైళ్ళు గుమాస్తాలు తీసుకెళ్ళాలన్నా రెండు రోజులు పడుతుంది. ఒక వేళ ఆ అధికారి ఇక్కడకు రావాలన్నా ఒక రోజు పడుతుంది. మరి నియమించిన అధికారులకుఈ వాస్తవాలు తెలియదా? శ్రీకాళహస్తీశ్వరాల య పాలన ఇప్పటికే గాడితప్పింది. అస్తవ్యస్తంగా మారింది. ఇంజనీరింగ్ అధికారులు ఏం చేస్తున్నారో వారికే ఎరుక. పరిపాలనలో అస్తవ్యస్తాలకు సంబందించి రోజూ విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. ఈ తరుణంలో ఇక్కడ ంరెగ్యూలర్ ఇఓను నియమించుకొని పరిపాలనకు సంబంధించి ప్రభుత్వంపై పడుతున్న నిందలను రూపుమాపుకోవాల్సి న పాలకులు ఎక్కడో 400 కిలో మీటర్ల దూరంలోని అధికారిని నియమించుకోవటంలో అతర్యమేమిటో వారికే తెలియాలి. ఇప్పటికే శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన మాస్టర్‌ప్లాన్ ముందుకు సాగటం లేదు. అంతేకాక భూగర్భ విద్యుత్ కేబుల్‌కు విద్యుత్ లైట్లు ఏడాదిగా ముందుకు సాగటం లేదు. ఇక ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంది, శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరగాల్సి ఉంది. రెగ్యూలర్ ఇఓ లేకపోతే ఎలా సాధ్యమౌ తుంది? ఇన్‌చార్జి అధికారి స్థానికంగా ఎవరో ఒకరి మీద ఆధారపడాల్సి వస్తుంది. ఇప్పటి వరకు ఇదే జరిగింది. దాంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. కొందరు అర్హత లేని వారు కూడా అందలం ఎక్కారనే విమర్శలు మూటకట్టుకున్నారు. మరి ఇప్పుడు ఇన్‌చార్జిని నియమిస్తే ఎలా అనేది చర్చనీయాంశంగా మారింది. రామారావును రెగ్యూలర్‌గా నియమించుకొని ఉంటే ప్రయోజనకరంగా ఉండేదని పరిశీలకులు భావిస్తున్నారు.

## గణనాధుని సన్నిధిలో ఏపీసీఆర్ మీడియా కమిటీ ఛైర్మన్



**కాణిపాకం, నవంబర్ 17 ప్రభాతవార్త:** ఏపీసీఆర్ మీడియా కమిటీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ రాజగోపురం వద్ద ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారి వెంట చిత్తూరు ఆర్డీఓ చిన్నెయ్య, ఐరాల తహసీల్దార్ సుశీల, ఐఅండ్ పీఆర్ డిప్యూటీ డైరెక్టర్పద్మజ,ఆలయసూపరెండెంట్లురంగస్వామి,శ్రీధర్‌బాబు,టెంపుల్ఇన్స్ పెక్టర్రమేష్‌బాబుపాల్గొన్నారు **జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: కొమ్మినేని** జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఏపీసీఆర్ మీడియా కమిటీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. కాణిపాకం ఆలయ దర్శ నార్థం వచ్చిన ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి జర్నలిస్టులకు న్యాయం జరిగేలా ఇళ్ళస్థలాల కేటాయింపుపై నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ళస్థలాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

## మున్సిపల్ కార్యాలయ నిర్మాణ పనులు వేగవంతం
– మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్



**కుప్పం, నవంబర్ 17 ప్రభాతవార్త :** కుప్పంలో సుమారు మూడు కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయ భవనాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ పేర్కొన్నారు. శుక్రవారం కమీషనర్ నరసింహప్రసాద్, డిఇ నాయక్‌తో కలసి భవన నిర్మాణ పనులు పరిశీలించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ జనవరి కల్లా భవన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని అదే నెలలో నూతన కార్యాలయంను ప్రారంభించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంజనేయగుడి ఛైర్మన్ కుమరేష్, కాంట్రాక్టర్ ప్రదీప్ పాల్గొన్నారు.

## బధిర పాఠశాల విద్యార్థులకు అన్నదానం



**కుప్పం, నవంబర్ 17 ప్రభాతవార్త :** కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ సతీమణి శ్రీప్రియ నర్సింగ్ హోం ఇన్‌చార్జ్ శ్రీ ప్రియ తన జన్మదినం సందర్భంగా శెట్టిపల్లి విక్టరీ బధిర పాఠశాల విద్యార్థులకు అన్నదానం జరిపారు. ఈసందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ దంపతులు బధిర పాఠశాల చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి పంచారు. పిల్లల మధ్య జన్మదినాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. కార్యక్రమాల్లో నిర్వాహకులు గోవిందరాజులు, రాము, కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం మర్చంట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా ఎడిఎస్ శరవణ



**కుప్పంరూరల్, నవంబర్ 17 ప్రభాతవార్త :** కుప్పం మర్చంట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా కుప్పం జడ్పీటిసి ఎడిఎస్ శరవణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం వ్యాపారులు, దుకాణదారులు మురుగన్ మహల్‌లో సమావేశమయ్యారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణమూర్తి, మహేష్‌బాబు, శంకర్‌బాబు, ఆర్ముగం, వెంకటేష్, శివ, సంతోష్ పాల్గొన్నారు.

## పేదలకు ఉచితంగా వస్త్రాలు.. నిత్యావసరాలు పంపిణీ
కుప్పం(రామకుప్పం), నవంబర్ 17 ప్రభాతవార్త :



విశాఖపట్నం శ్రీశారద పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర స్వామి జన్మదినాన్ని సాయిమాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రామకుప్పం మండలం రాజుపేట, పంద్యాలమడుగు పంచాయతీ యానాది కాలనీల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు 250 చీరలు, 250పంచెలు, నిత్యావసర సరుకులను ఆయన ఉచితంగా పంపిణీ చేశారు. స్వామి అనుగ్రహం పేద ప్రజలపై ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

**కుప్పంరూరల్, నవంబర్ 17 ప్రభాతవార్త :** సాయిమాతా సేవా ట్రస్ట్, బెంగళూరు శంకర్ కంటి ఆస్పత్రి అధ్వర్యంలో ఈనెల 19న కుప్పం బాలుర హైస్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని సాయిమాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు తెలిపారు. కంటి జబ్బులతో బాధపడేవారు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9391833999నెంబరును సంప్రదించాలని కోరారు.

## 150 పాకెట్లు సారా స్వాధీనం

**సదుం,నవంబరు17 ప్రభాతవార్త :** మండల పరిధిలో పోలీసులు దాడులు చేసి 150 నాటు సారా పాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మారుతికి రాబడిన సమాచారం మేరకు బూరగమంద పంచాయతీ సీఎం గొల్లపల్లె వద్ద తనికీలు చేస్తుండగా వారిని చూసి సుబ్రమన్యం అనే వ్యక్తి ఒక ప్లాస్టిక్ సంచిని పారవేసి పరుగెత్తి వెళ్లిపోయాడు. ఆసంచిని తెరచి చూడగా దాదాపు 150 పాకెట్లు నాటుసారా పొట్లాలు కనపడ్డా యి.స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చప్పారు.

## రూ.40 కోట్లతో గ్రామాల అభివృద్ధి



**యర్రావారిపాలెం,నవంబరు17 ప్రభాతవార్త :** యర్రావారిపాలెం మండలంలో డాక్టర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో తుడా నిధులు దాదాపు రూ.40 కోట్లతో గ్రామాలను అభివృద్ధి చేశామని తుడా ఛైర్మెన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీపీ శివలక్ష్మీ ఆధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ బారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను రోల్ మోడల్‌గా సీఎం జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ది చేశారని చెప్పారు.అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేయడం భాదాకరమని చెప్పారు. ఈసందర్భంగా హౌసింగ్ బిల్లుల జాప్యంపై బోడేవాండ్లపల్లె సర్పంచి మధు,ఉస్తికాయలపెంట సర్పంచి రమేష్‌లు నిలదీశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో కోడిగుడ్డు సైజు తగ్గుతోందని ఐసీడీఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ప్రత్యేక ఆహ్వానితులు చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ వందేళ్లుగా జరగని అభివృద్ది ఈ నాలుగేళ్లలో జరగిందని ప్రతి పక్షాల విమర్శలను పట్టించుకోవాలసిన పని లేదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కరుణాకర్‌రెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచిలు, అధికారులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయిలో పక్కాగా కులగణన : కమీషనర్

**చిత్తూరు, నవంబర్ 17 ప్రభాతవార్త:** చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కుల గణను పక్కాగా చేపట్టి పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశించారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, చిత్తూరు రూరల్ మండలాల పరిధిలో కుల గణన–2023 నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు అర్బన్ మాస్టర్ ట్రైనర్, డిప్యూటీ కలెక్టర్ శివయ్య మున్సిపల్, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కమీషనర్ డాక్టర్ జె.అరుణ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో కుల గణకు సంబంధించి ఎలాంటి పొరబాట్లకు తావు లేకుండా చేయాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ శివయ్య మాట్లాడుతూ వార్డు స్థాయిలో ఈ నెల 21–23 తేదీల్లో వాలంటీర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు.సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజ్యలక్ష్మీ, తహసిల్దారు మురళీమోహన్, ఎంపిడిఓ సుధాకర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

## జగనన్న విద్యాదీవెనకు ఉమ్మడి ఖాతాలు

**చిత్తూరు, నవంబర్ 17 ప్రభాతవార్త:** నాల్గవ విడత జగనన్న విద్యా దీవెన పథకం లబ్ది కోసం సంబంధిత విద్యార్థి, వారి తల్లి పేరిట ఉమ్మడి బ్యాంకు ఖాతాలు తెరిపించాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ పేర్కొన్నారు. జగనన్న విద్యా దీవెనపై శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సాంఘీక సంక్షేమ శాఖ డిడి డాక్టర్ రాజ్యలక్ష్మీతో కలిసి కమీషనర్ డాక్టర్ జె.అరుణ వార్డు సంక్షేమ కార్యదర్శులు, సిఓలు, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమీషనర్ డాక్టర్ జె.అరుణ మాట్లాడుతూ మూడు రోజుల్లో ఉమ్మడి బ్యాంకు ఖాతాలు ప్రారంభించేలా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమన్వయం చేసుకోవాలన్నారు. సిఓలు, ఆర్పీలు బ్యాంకు అధికారులతో చర్చించి ఖాతాలు తెరవడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రారంభించిన ఉమ్మడి బ్యాంకు ఖాతాల వివరాలను వార్డు సచివాలయంలో ఎడ్యుకేషన్ సెక్రటరీల ద్వారా నవశకం పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.సిఎంఎం గోపి, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పూతలపట్టు బిజెపి ఇన్‌ఛార్జీగా భానుప్రకాష్

**బంగారుపాళ్యం, నవంబర్ 17 ప్రభాతవార్త:** పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఇన్‌ఛార్జీగా మొగిలి వెంకటగిరికి చెందిన ఎల్.భానుప్రకాష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరీ ఉత్తర్వులు జారీ చేశారు. భానుప్రకాష్ ఎబివిపి విద్యార్థి సంఘ నాయకుడిగా పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. బిజెపి జిల్లా యువమోర్చ ఉపాధ్యక్షులుగా పని చేశారు. అలాగే 2019 పూతలపట్టు అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేశారు. తాను బిజెపికి నిరంతరం సేవలు అందించినందుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా పార్టీ అధ్యక్షురాలు నియమించారని ఆయన తెలిపారు. అలాగే జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు, మాజీ ఎంపి దుర్గా రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ఎన్‌పి వెంకటేశ్వర చౌదరిలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అత్యాచారం కేసులో నిందితుడు అరెస్టు

**బంగారుపాళ్యం, నవంబర్ 17 ప్రభాతవార్త:** మండలంలోని శేషాపురం గ్రామంకు చెందిన 76 సంవత్సరాల వృద్ధురాలిపై అదే గ్రామంకు చెందిన ఓ.రామ్మూర్తి బుధవారం అర్ధరాత్రి అత్యాచారం చేశాడు. బాధిత వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ నాగరాజరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం పాలేరు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నిందితుడు రామ్మూర్తిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు సిఐ నాగరాజరావు తెలిపారు.

# చిత్తూరు డివిజన్
చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం



## లోకమాతకు రాహుకాలాభిషేకం
బోయకొండ(చౌడేపల్లి), నవంబర్ 17 ప్రభాతవార్త :

లోకమాత గంగమ్మకు శుక్రవారం రాహుకాలాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. దంపతులు, కుటంబ సభ్యులతో అమ్మవారికి రాహుకాల సమయంలో అభిషేకించడం వల్ల సుఖ శాంతులతోవుంటారని పండితులు తెలిపారు. అంతేకాకుండా లోకం సుభిక్షంగావుంటుందని భక్తుల విశ్వాసం. దీంతో రాహుకాలాభిషేకానికి దంపతులు, భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. రాహుకాల సమయంలో గంగమ్మకు పసుపు, కుంకుమ, నీరు వంటి జలాలు, నారికేళాభిషేకం నిర్వహించారు. ఆలయ ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళి, అర్చక, అధికార, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## 26న ఉచిత ఎన్‌ఎంఎంఎస్ మాదిరి పరీక్ష

**చిత్తూరురూరల్, నవంబరు 17 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, రెవిన్యూ డివిజన్ కేంద్రాలలో రాష్ట్ర స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆద్వర్యంలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)ఉచిత మాదిరి ప్రవేశ పరీక్ష(ఇంగ్లీషు మీడియం)ను ఈనెల 26న ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.నరోత్తమరెడ్డి తెలిపారు. ఈ మాదిరి పరీక్షకు కేంద్రప్రభుత్వం డిసెంబరు 3న నిర్వహిస్తున్న ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు హాజరు కావడానికి హాల్ టిక్కెట్లు పొందిన 8వ తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వారి వారి పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.కుప్పం,వికోట,పలమనేరు,బంగారుపాళ్యం,యాదమరి,చిత్తూరు,గంగాధరనెల్లూరు, కార్వేటినగరం,పుత్తూరు,నగిరి,పూతలపట్టు,పాకాల,కల్లూరుకేంద్రాలలోపరీక్షనిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకుపి.నరోత్తమరెడ్డి(9440711784),సుబ్బారావు(9948437301)లను సంప్రదించాలని కోరారు.

## పుస్తకాల పఠనంతో విజ్ఞానం పెరుగుతుంది



**వెదురుకుప్పం, నవంబర్ 17 ప్రభాతవార్త :** పుస్తకాల పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని విద్యార్థులు నిత్యం జ్ఞానం పెంచుకోవడంకు పుస్తక పఠనం చేయాలని వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద చూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కళాశాల లైబ్రరీలో పుస్తక ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తకాలు విజ్ఞాన బండాగారాలని విద్యార్థులు చదువుకుని ప్రతిభను పెంచుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవలని చెప్పారు. ఎంత నేర్చుకున్న ఇంకా తెలుసుకోవలసిన విషయాలు ఎన్నో ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ప్రభాకర్‌రావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వెంకటేష్, గ్రంథాలశాఖ అధిపతి సతీష్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ భరణినాధ్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు
సదుం, నవంబరు17ప్రభాతవార్త :

మండల పరిధిలోని పలు ఆలయాలలో శుక్రవారం నాగుల చవితిని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. జాంద్రపేటలోని శ్రీఅరుణాచలేశ్వరస్వామి వారి ఆలయంలో శివమాల వేసిన భక్తులు దాదాపు సోమల మండలానికి చెందిన వంద మందికిపైగా సందడి చేశారు. ఆలయంలో ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. వీరికి ఆలయ ధర్మకర్త సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో రాత్రి అన్నదానం ఏర్పాటు చేశారు. అదేవిధంగా స్థానిక బ్రాహ్మణవీధిలోని నాగులరాళ్లవద్ద, సుబ్రమన్యస్వామి గుడి వద్ద మహిళలు తెల్లవారుజామున లేచి స్నానాలు ఆచరించి భక్తి శ్రద్ధలతో దీపాలునాగుల రాళ్లకు పాలుపోసి పూజలు నిర్వహించారు.

## ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు టోపీ!

**సదుం,నవంబరు17 ప్రభాతవార్త :** మండల పరిదిలోని ఓ యువకుడు ఉద్యోగాలు తీసిస్తానని నమ్మబలికి వారి వద్ద డబ్బులు వసూలు చేసి టోపీ పెట్టిన సంఘటన జరిగింది. సదుం ఎస్సై మారుతి తెలిపిన మేరకు మండల పరిదిలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన మల్లిశెట్టి గురుమూర్తి అనే అతనుగత యేదాది కాలంగా పలువురు నిరుద్యోగులకు పలురకాల ఉద్యోగాలు తీసిస్తానని ఆశచూపి వారి వద్దనుంచి డబ్బులు వసూలు చేశాడు. ప్రభుత్వ పాఠశాలల్లో యోగా మాస్టరు ఉద్యోగాలు తీసిస్తానని బూరగమంద గ్రామానికి చెందిన రెడ్డి భూ అనే ఆమెరూ.1,50,000లు ఇచ్చింది. ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చి పాఠశాలకు పంపించాడు. అక్కడ డ్యూటీలో చేరింది., అయితే నెలలు గడిచినా జీతం రాలేదు. దీనితో ఆమె అతన్ని నిలదీసింది.అతనుసరిగా సమాధానం చెప్పక పోవడంతో మోసపోయామని గ్రహించి సదుం పోలీసు లను ఆశ్రయించింది.వారి ప్రకారందాదాపుఅతనురూ.15 నుంచి 20లక్షలు వరకు నిరుద్యో గుల నుంచి డబ్బులు వసూలుచేశాడు. పలువురు నిరుద్యోగులు తాము ఆర్థికంగ ఇబ్బందుల్లో ఉన్నా అక్కడా ఇక్కడా అప్పు తెచ్చి ఇచ్చామని వాపోయారు. దీనిపై సదుం పోలీసుల స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.ఎస్సై మారుతి మాట్లాడుతూ నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలుచేసే వారిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వీలైనంత వరకు సమాచారం నిజమా కాదా అని చెక్ చేసుకోవడం మంచిదని చెప్పారు.

# గూడూరు డివిజన్
గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వివాహ వేడుకల్లో పాల్గొన్న ఓజిలి టిడిపి నాయకులు
ఓజిలి, నవంబర్ 17 ప్రభాతవార్త :



ఓజిలి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఓజిలి వెంకటయ్య కుమార్తె ఓజిలి లాస్య వివాహ వేడుకల్లో శుక్రవారం టిడిపి మండల అధ్యక్షులు విజయ్‌కుమార్‌నాయుడు, ఉపాధ్యక్షులు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు వల్లూరు రమేష్‌బాబు, ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖలీల్, సుబ్రహ్మణ్యం రాజు, సూరిరెడ్డి, ఓజిలి భాస్కర్, ఓజిలి సుష్మంత్‌కుమార్, బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## ఓజిలిలో ఘనంగా నాగులచవితి వేడుకలు
ఓజిలి, నవంబర్ 17 ప్రభాతవార్త :



చల్లంగా చూడవయ్యా నాగరాజా అంటూ మహిళలు నాగులచవితి పండుగను జరుపుకున్నారు. నాగుల చవితిని పురస్కరించుకొని శుక్రవారం ఓజిలి మండలంలోని అన్ని గ్రామాల్లో తెల్లవారుజామునే పుణ్యస్నానాలు చేసి నోముల దారాలు, నువ్వులు, చలిపిండి తయారు చేసుకొని పుట్టల వద్దకు చేరుకున్నారు. ఓజిలి మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి నాగులచవితిని ఘనంగా జరుపుకున్నారు.

## ఘనంగా నాగులచవితి వేడుకలు
దొరవారిసత్రం, నవంబర్ 17 ప్రభాతవార్త :

దొరవారిసత్రం మండల పరిధిలోని అక్కరపాక, పోలిరెడ్డిపాలెం, పూలతోట, కల్లూరు, శ్రీధనమల్లి, తనయాలి, బూదూరు తదితర గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నాగులచవితి వేడుకలు నిర్వహించారు. ముందుగా నాగులచవితి సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు, పిల్లలు భక్తిశ్రద్ధలతో నాగులపుట్ట వద్ద పాలు పోసి పూజలు చేశారు. అనంతరం మొక్కులు చెల్లించారు. దీపావళి జరిగిన 5వ రోజు నాగులచవితిని అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణంలో నిర్వహించడం ఆనవాయితీ.

## రాఘవాపురం వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తాం
– ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి స్పష్టం
కోట, నవంబర్ 17 ప్రభాతవార్త :



కోట మండలం రాఘవాపురం, తణుకుమాల గ్రామాల మధ్య హైలెవల్ వంతెనను నిర్మిస్తామని ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి స్పష్టం చేశారు. శుక్రవారం కేశవరం పంచాయతీలోని రాఘవాపురం, తణుకుమాల మార్గంలో కల్వర్టు లేక వర్షాకాలంలో ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక నాయకులు ప్రసాద్, గురుస్వామి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ వంతెన లేకపోవడం వల్ల వర్షాకాలంలో అటు చిల్లకూరు, ఇటు కోట మండల ప్రజలు ఎన్నో సంవత్సరాల నుంచి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యేకి వైసీపీ నాయకులు వివరించారు. దీంతో ఎమ్మెల్యే వరప్రసాదరావు కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఆయన వెంట సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్య, స్థానిక నాయకులు ఉన్నారు.

## వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : నేదురుమల్లి
వెంకటగిరి, నవంబర్ 17 ప్రభాతవార్త :



2024లో జరగబోయే ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని నేదురుమల్లి భవనంలో బిఎల్‌ఏలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోగస్ ఓటర్లు వుంటే తొలగించాలని, కొత్త ఓటర్‌ని కూడా చేర్పించేందుకు కృషి చేయాలని తెలిపారు. సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. అందరూ వైసిపి గెలుపుకు సాయి శక్తుల కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు పర్వత రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మేరిగ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ కాలనివాసులు సమస్యలను పరిష్కరించాలి
కోటనవంబర్ 17 ప్రభాతవార్త :



కోట మండలం కేశవరం గ్రామ పంచాయతీ లోని శుక్రవారం గూడూరు శాసన సభ్యులు డాక్టర్.వెలగపల్లి వర ప్రసాద్‌రావు పర్యటించారు. ఆమేరకు గ్రామ వైకాపా నాయకులు చిట్టేడు మాజీ సొసైటి ఛైర్మెన్ ఉలవకాయల ప్రసాద్, వైకాపా సినియర్ నాయకులు గురుస్వామిలు కాలనీ ప్రజలు ఎన్నో సంవత్సరాల నుంచి నివస్తున్న వారికి ప్రొజషన్ సర్టిఫికేట్లు లేవని విషయాన్ని వారు శాసన సభ్యులు వర ప్రసాదరావు దృష్టికి తీసకెళ్లారు. దీంతో ఆయన స్పందించారు. కాలనీకి అధికారులను రమ్మని వారి సమక్షంలో జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అందుకు కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించారని చెప్పారు. కాలనీలో రోడ్లు మంచి నీటి వసతి వంటి మౌలిక వసతులు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సంబధింత అధికారులను ఆదేశించారు.తహిశీల్దార్ పద్మావతి కూడా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. దీంతో కాలనీ వసులు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే వర ప్రసాద్‌రావు కు జీవితాంతం రుణ పడి ఉంటామని గిరిజనులు,నక్కల్లోలు తెలిపారు.ఆయన వెంట సెంట్రర్ బ్యాంక్ డైరెక్టర్ నరమాలవెంకటరమణయ్య, వాకాడు మండల కన్వీనర్ నేదురుమల్లి రంజాన్ రెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యులు ఉప్పల ప్రసాద్‌గౌడ్,విగ్రహాల రఘరామయ్య, సుబ్బన్న,తదితరులు ఉన్నారు.

## ఘనంగా నాగులు చవితి వేడుకలు
కోట, నవంబర్ 17 ప్రభాతవార్త :



మండలంలోని చిట్టేడు, విద్యానగర్, చెందోడు, గూడలి, చంద్రశేఖపురం, ఊనుగుంటపాళెం, కేశవరం, సిద్దమ కండ్రిగ, మద్దాలి, మద్దాలి కండ్రిగ, రాజుపాళెం, తిన్నెపూడి, వెంకన్నపాళెం, జరుగుమల్లి, కోత్తపాళెం, కొక్కుపాడు, ఉత్తమ నెల్లూరు, సిద్ధవరం, కర్లపూడి, కోత్తపట్నం,పుచ్చపల్లి, తదితర గ్రామాల్లో నాగుల చవితి పర్వదినం పురస్కరించుకుని భక్తులు నాగేంద్రడికి పూజలు నిర్వహించారు.పుట్టల్లో మహిళలు, చిన్నారులు, పాలు పోసి నాగేంద్రుడికి మొక్కలు చెల్లించారు.

## ఘనంగా నాగుల చవితి వేడుకలు
బాలాయపల్లి, నవంబర్ 17 ప్రభాతవార్త :



మండలంలో ఘనంగా నాగుల చవితి వేడుకలను నిర్వహించారు. భక్తులు పుట్టలో పాలు పోసి, గోడిగుడ్లు వేసి పూజలు నిర్వహించారు. వెంగమాంబపురం, జయంపు, బాలాయపల్లి, నిడిగల్లు తదితర గ్రామాల్లో ఉన్న పుట్టల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. పుట్టల చుట్టూరు దారం మట్టి పుట్టలో ప్రసాదాలు వేసి పూజించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు : ఎస్ఈబి ఇన్స్పెక్టర్
వెంకటగిరి, నవంబర్ 1, ప్రభాతవార్త :



గంజాయి విక్రయిస్తున్న అరవ రమణమ్మ, అరవ రమణయ్యలను అరెస్టు చేసి 37 వేల రూపాయిలు విలువ కలిగిన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర రావు తెలిపారు. వెంకటగిరిలోని ఎస్ఈబి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అరవ రవణమ్మ, అరవ రమణయ్య అరవ పాలెంకు చెందిన వీరు అక్రమంగా గంజాయి కొని వీరు విద్యార్థులు, తదితరులకు విక్రయిస్తుంటారని తెలిపారు. నిఘా పెట్టి వీరిని పట్టుకున్నట్లు చెప్పారు. గంజాయి విక్రయించిన సేవించిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల చవితి వేడుకలు
వెంకటగిరి, నవంబర్ 17 ప్రభాతవార్త :

పట్టణం, గ్రామాల్లో ఘనంగా నాగుల చవితి వేడుకలను నిర్వహించారు. భక్తులు పుట్టలో పాలు పోసి, కోడిగుడ్లు వేసి పూజలు నిర్వహించారు. పట్టణంలో రామలింగేశ్వర స్వామి ఆలయం, శివాలయం, సుబ్రమణ్యస్వామి ఆలయాల ప్రాంతాల్లో ఉన్న పుట్టల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. పుట్టల చుట్టూరు దారం చుట్టి పుట్టలో ప్రసాదాలు వేసి పూజించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

## వెందోడు స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు ఆపాలి
–రైల్వే సిపిటిఎం యల్లెంద్ర యాదవ్‌కి సుబ్బారావు వినతి
బాలాయపల్లి, నవంబర్ 17 ప్రభాతవార్త :



బాలాయపల్లి మండలం వేందోడు స్టేషన్ నందు కృష్ణా, పూరి, బిలాసపూర్, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు ఆపాలని రైల్వే సిపిటిఎం యల్లెంద్ర యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జయంపు గ్రామానికి చెందిన సుబ్బారావు వినతి పత్రం అందజేసారు. అసిస్టెంట్ బిజినెస్ ఆఫీసర్ పాముల రాంబాబు, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు సి. చంద్రప్పా, ఉపాధ్యక్షురాలు డి. ప్రశాంతి రాజుల వద్ద రెప్రసంటేషన్ లెటర్ తీసుకుని సౌత్ సెంట్రల్ రైల్వే సిపిటిఎంను కలిసి విన్నవించారు. ఇందుకు ఆయన స్పందిస్తూ త్వరలోనే హాల్టింగ్ ఉంటుందని హామీ ఇచ్చారు. పైన కనపరిచిన రైళ్ల త్వరలో రైళ్ళు ఆగుతాయని అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. వారికి సదరు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో నాగులచవితి
సూళ్లూరుపేట, నవంబర్ 17 ప్రభాతవార్త :



సూళ్లూరుపేటలో నాగులచవితి పర్వదినాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చెంగాళమ్మ దేవస్థానం లోని నాగులపుట్ట వద్ద మహిళా భక్తులు పెద్దసంఖ్యలో చేరుకొని సాంప్రదా యబద్ధంగా నాగుల పుట్టకు పూజలు చేశారు. అలాగే సాయినగర్, మన్నారుపోలూరు, కెఆర్‌పాలెం, బాలాంజనేయస్వామి దేవస్థానం, శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానంలోని నాగుల పుట్టలకు భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదాలను పంచిపెట్టారు.

## ఘనంగా నాగుల చవితి వేడుకలు
గూడూరు, నవంబర్ 17 ప్రభాతవార్త :



నాగుల చవితి పర్వదినాన్ని ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గూడూరు పట్టణంలోని శ్రీ మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో కొలువై ఉన్న నాగప్రతిమలు కోర్టు ఆవరణలో ఏర్పాటై ఉన్న పుట్ట వద్ద, జానకీరాంపేటలోని పుట్టతో పాటు గాంధీనగర్ ప్రాంతంలో ఉన్న నాగులపుట్టల వద్ద మహిళలు విరివిగా పాల్గొని నాగేంద్రుడికి పాలు పోశారు. పుట్టల చుట్టూ దారాలు కట్టి పసుపు, కుంకుమ పూశారు. అనంతరం స్వామి వారిని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వాటిని భక్తులకు పంచిపెట్టారు. అదే విధంగా గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు ప్రాంతంలోని శివాలయంలో ఏర్పాటై ఉన్న నాగశిలలు వద్ద, కటలమ్మ గుడి ప్రాంగణంలో ఏర్పాటై ఉన్న పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

## భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు
తడ, నవంబర్ 17 ప్రభాతవార్త :

తడ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు జరుపుకున్నారు. పలుచోట్ల నాగుల పుట్టల వద్ద పూజలు చేశారు. పుట్టల్లో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఇప్పటికీ వర్షాలు తగినంత కురవకపోవడంతో ఈ సారి కరవుతీరా వానలు కురవాలని నాగదేవతలను ప్రార్థించారు. జాతీయ రహదారి పక్కన, కొందూరు, అక్కంపేట, తడకండ్రిగ తదితర చోట్ల పెద్దసంఖ్యలో మహిళలు నాగులచవితి వేడుకలు జరుపుకున్నారు. ఎక్కువమంది ఇళ్లలోనే నాగదేవతలను పూజించారు.

## ఘనంగా నాగుల చవితి వేడుకలు
చిల్లకూరు, నవంబర్ 17 ప్రభాతవార్త :



మండలంలోని చింతవరం గ్రామ సమీపంలోకట్టపై వెలసి ఉన్న సుబ్రమణ్యాస్వామి ఆలయం వద్ద శుక్రవారం మహిళలు పెద్ద ఎత్తున వచ్చి నాగుల పుట్టకు పూజలు నిర్వహించారు. అలాగే ఎల్‌ఏపి స్కూల్ వద్ద ఉన్న నాగుల పుట్టకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టకు పాలు, గుడ్లు సమర్పించి, పుట్ట చుట్టూ దారం కట్టి మహిళలు మొక్కులు సమర్పించారు. అదే విధంగా ప్రతి గ్రామంలో మహిళలు ఉపవాసాలు ఉంటూ నాగుల పుట్ట వద్ద పూజలు నిర్వహించారు.

## ప్రసంగాలు వినటం కాదు...విన్నది ఆచరించాలి

శ్రీకాళహస్తి,నవంబర్ 17 ప్రభాతవార్త :



ఆధ్యాత్మిక ప్రసంగాలను చెవులు రిక్కించి వినటం కాదు. విన్న ప్రసంగాల్లోని సారాంశాన్ని ఆచరించాలని హాఫీజే ఖుర్ అన్ రేహాన్ అన్నారు. శుక్రవారం జామియామస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన మానవుని అల్లాహ్ ఎందుకు సృష్టించారు.మానవుని జీవిత రహస్యం,మరణం గురించి అవగాహన కల్పించుకోవాలన్నారు.అల్లాహ్ మానవుని తన ఆరాధన కోసం సృష్టించి సకల సుఖాలను అందించారని అయితే పుట్టిన వాడు గిట్టక మానడు.మానవ జీవితం మజిలి మాత్రమే అని ఇది శాశ్వతం కాదనే సత్యాన్ని గ్రహించి మరణం తరువాత నిజమైన జీవితం ప్రారంభం అవుతుందన్నారు.మనం అల్లాహ్ ఆదేశాలను ఆచరిస్తూ మన ప్రవక్త ఆచరించిన సిద్దాంతాలను ఆచరిస్తూ ప్రశాంత జీవనం గడపాలని పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా మన కట్టూ బొట్టు గురించి సమాజులో ఆచరిం చాల్సి న విధానాల గురించి సోదాహరణంగా వివరించారు.మనం నిత్యం అల్లాహ్ ధ్యానంలో ఉంటూ పరోపకార భావం కల్గి ఉండాలన్నారు. ఇరుగుపొరుగుతో సత్సంబంధాలు కల్గి ఉండాలన్నారు. గురువులను ఆశ్రయించి జీవిత సత్యాలను తెలుసుకోవాలని పిలుపు నిచ్చారు.

## తెలుగుదేశంపార్టీతోనే మహిళలకు రక్షణ సాధ్యం : రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, నవంబర్ 17 ప్రభాతవార్త :



మహిళలకు రక్షణ తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డిలు శుక్రవారం పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి కంటా రమేష్, రామమూర్తి, కళత్తూరు కుమార్, నింద్ర సుధాకర్, సుబ్రమణ్యం, చంద్ర ప్రకాష్, కిరణ్, గణి నరసింహులు కృష్ణకుమార్, ఉదయ్‌ల ఆధ్వర్యంలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా సుధీర్‌రెడ్డి, రిషితారెడ్డిలు ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేసి తెలుగుదేశం పార్టీ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. శ్రీకాళహస్తిలో అభివృద్ధి జరగాలంటే గోపాలన్న పాలన మళ్ళీ రావాలన్నారు. ప్రజలకు స్వేచ్ఛగా జీవించాలంటే తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మిన్నల్‌రవి, మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు వాకచర్లగురప్పశెట్టి, కాసరం రమేష్, వంకాయలసిద్దులయ్య, హేమంత్, విక్కీ, ఖాదర్, అస్మత్, సుబ్బయ్య, షాకిరాలీ, బుజ్జి, ప్రతాప్‌రెడ్డి, ఎంఎస్‌రెడ్డి, ముజీబ్ మహిళలు కృష్ణవేణి, మల్లీశ్వరి, సుమతి, అనిత, సుప్రజ, పద్మ, తుసలి, చంద్రమ్మ, ద్రాక్షాయణి, అమరావతి, దుర్గ, సుభాషిణి, మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంఎల్ఏకు విశాఖ పీఠాధిపతి ఆశీర్వచనాలు

శ్రీకాళహస్తి, నవంబర్ 17 ప్రభాతవార్త :



చల్లంగా ప్రజల్ని పరిపాలించు, విజయం ప్రాప్తిరస్తు' అంటూ విశాఖ శారదపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డిని ఆశీర్వదించారు. పీఠాధిపతి జన్మదిన సంబరాలు సందర్భంగా శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి స్వామిని కలుసుకున్నారు.శ్రీకాళహస్తీశ్వరుని తీర్ధ ప్రసాదాలను అందించారు. శాసనసభ్యుని చూస్తూనే 'మధూ' అంటూ పలకరిస్తూ ఆశీర్వదించారు.అలాగే ఉత్తరాధికారి కూడా ఎంఎల్ఏను విజయస్తు అంటూ ఆశీర్వదించారు. శారదపీఠం స్వామి ఆశీర్వదించి దుశ్శాలువతో సత్కరించి పండ్లు ప్రసాదాన్ని అందించారు.

## భారత్‌గ్యాస్ పరంధామనాయుడు మృతి

శ్రీకాళహస్తి,నవంబర్ 17 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి పట్టణ ప్రజలకు సుపరిచయస్తులైన భారత్ గ్యాస్ శ్రీకాళహస్తిలో పరిచయం చేసిన గెడిగిపూడి పరంధామనాయుడు శుక్రవారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఆయన తుది శ్వాస శుక్రవారం విడిచారు. పట్టణంలోని జయరామారావు వీదిలోని ఓ ఇంటిలో భారత్‌గ్యాస్ ఏజెన్సిని పరంధామ నాయుడు ప్రారంభించారు.ఆయన హయాంలో ఒక్క శ్రీకాళహస్తి లోనే కాకుండా రేణిగుంట,తిరుపతి వారికి కూడా అందించారు, అంతేకాక రెండవ సిలిండర్లను అందించటంలోకూడా ఆయన వినియోగదారులకు ఎంతో చేయూత నిచ్చారు. ఆయనతో పాటు అల్లుడు కృష్ణమూర్తి కూడా వినియోగదారులతో సహాకరించారు. సుమారు 75 సంవత్సరాల వయస్సు కల్గిన ఆయన మృతదేహానికి పలువురు నివాళులర్పించారు. ఆయన తనయుడు జి.విజయకుమార్‌నాయుడు ప్రస్తుతం తెలుగుదేశం పట్టణ అధ్యక్షులుగా ఉన్నారు. శనివారం మధ్యాహ్నం 2.30గంటలకు దహన క్రియలు జరుగుతాయని విజయకుమార్ నాయుడు తెలిపారు.

ఫోటో -ఎస్‌కెహెచ్‌టి-8

## పరంధామనాయుడుకు రిషితారెడ్డి నివాళులు

శ్రీకాళహస్తి, నవంబర్ 17 ప్రభాతవార్త



పట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు విజయకుమార్ తండ్రి పరంధాములు నాయుడు శుక్రవారం మధ్యాహ్నం అనారోగ్యంతో కన్నుమూశారు. ఈసందర్భంగా విషయం తెలుసుకున్న బొజ్జల రిషితారెడ్డితో పాటు పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు హజరై పరంధాములు నాయుడు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## 19న బిసిల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయండి

శ్రీకాళహస్తి, నవంబర్ 17 ప్రభాతవార్త :



ఈనెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు రేణిగుంటలోని వై కన్వర్షన్‌లో జరిగే బిసి రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు బిసి నాయకులు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి మాట్లాడుతూ ఈ వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళు సంవత్సరకాలంలో బిసిలను నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబునాయుడు నాయకత్వంలో బిసిలకోసం రూ.32వేలకోట్లు సబ్‌ప్లాన్ నిధులును బిసి వర్గాలకు అభివృద్ధి సంక్షేమానికి ఖర్చుచేశారని గుర్తుచేశారు. అయితే వైకాపా ప్రభుత్వం బిసిలను ఓట్లుగా మార్చుకుని వారిని పక్కనపెట్టిందన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బిసి నాయకులు మిన్నల్‌రవి, రాష్ట్ర బిసి కార్యదర్శి రేణుకాదేవి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుబుజ్జి రాష్ట్ర యువత నాయకులు ప్రతాప్, రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ మాజీ కార్యదర్శి ఉమేష్‌రావు, పార్లమెంటు నాయకులు ఎంఎస్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, రాఘవులు, మునిరాజయాదవ్, ఏర్పేడు, తొట్టంబేడు మండల నాయకులు పాల్గొన్నారు.

## టిటిడిలో ధర్మపాలన కొనసాగుతుంది

-టిటిడి ఈవో ధర్మారెడ్డిపై ఆరోపణలు నిరాధారం

-టిటిడి మాజీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్

తిరుపతిరూరల్, నవంబర్17 ప్రభాతవార్త:



టిటిడి ఈవో ధర్మారెడ్డి ఆధ్వర్యంలో ధర్మపాలన కొనసాగుతుందని టిటిడి మాజీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్ కుమార్ ఒక ప్రకటనలో అన్నారు. దేశంలోనే అతిపెద్ద ధార్మిక సంస్థ తిరుపతి తిరుమల దేవస్థానం ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న ధర్మారెడ్డి టిడిపి నేత ఆనం వెంకటరామిరెడ్డి నిరాధారమైన ఆరోపణలు చేయడం సిగ్గు చేటు అన్నారు. టిటిడి ఈవోగా ధర్మారెడ్డి వచ్చాక టిటిడి ఎంతో అభివృద్ది చెందిందని, సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. కేవలం రాజకీయ పబ్లిసిటీ కోసం ధర్మారెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆనం వెంకటరమణారెడ్డి రాజకీయ బ్రోకర్‌గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డిల్లీ స్థాయిలో పనిచేసి వచ్చిన ధర్మారెడ్డిని గల్లీ నాయకుడైన ఆనంకు లేదని మండిపడ్డారు.

## అప్పు వసూలు కోసం వృద్దురాలి ఇంటికి తాళం

-పుంగనూరులో ఘోరం : నెలరోజులుగా ఇంటిబయటే బతుకు

పుంగనూరు,నవంబర్ 17 ప్రభాతవార్త :

మండలంలోని బండ్లపల్లి గ్రామంలో ఒక వడ్డీవ్యాపారి దాష్టికానికి నెల రోజులుగా ఒక వృద్దురాలు వానకు తడుస్తూ,ఎండకు ఎండుతూ,ఇంటి బయటే దారుణంగా బతుకుతున్న విషయం వెలుగులోనికి వచ్చింది. గ్రామానికి చెందిన మంగమ్మ కుమారుడు స్థానికంగా ఉదయ్‌కుమార్ అనే వ్యక్తి వద్ద కొంత డబ్బు రుణంగా తీసుకున్నాడు. ఈక్రమంలో మంగమ్మ కుమారుడు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన వడ్డీవ్యాపారి నెలక్రితం మంగమ్మ ఇంటికి తాళం వేశాడు. అయితే,కొడుకు తీసుకున్న డబ్బులకు తనను దూషించడంతో పాటూ ఇంటికి తాళంవేసి వేధిస్తున్నారని మంగమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. నెల రోజులుగా ఇంట్లోకి వెళ్ళలేక దారుణ కష్టాన్ని అనుభవిస్తున్నానని ఆమె వివరించింది. గ్రామస్తులకు ఈవిషయం తెలిసినా,పట్టించుకోలేదని,వడ్డీవ్యాపారి దాష్టికాన్ని ఎదిరించేందుకు ఎవరూ సాహసించలేదని తెలిసింది. రోజు రోజుకూ ఎక్కువైపోతున్న వడ్డీవ్యాపారస్తుల ఆగడాలకు ఇది నిదర్శనం. ఈసంఘటనపై అధికారులు స్పందించాల్సి ఉంది.

## రబీ వరిసాగులో మెళకువలు పాటించాలి

వరినాట్లుకు జాగ్రత్తలు తీసుకోవాలి : ఎడిఏ



తిరుపతి,నవంబర్ 17ప్రభాతవార్త: రబీ వరిసాగులో దుక్కిలో ఎరువుల వాడకంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ,ఆఖరి దుక్కిలో ఎకరాలకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసి కలియదున్నుకోవాలని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ మెరుగు భాస్కరయ్య సూచించారు. నాటేముందు రైతులు సూటి ఎరువులను, వివిధ కాంప్లెక్స్ ఎరువులను వేస్తుంటారు. సూటి ఎరువులు వేసేవారు సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్ ఎకరానికి 150 కిలోలు, యూరియా 30 కిలోలు, పొటాస్ 15 కిలోలు వేసుకోవాలి. డిఎపి వేసేరైతులు ఎకరానికి 50 కిలోలు డిఎపి, 15కిలోల యూరియా.15 కిలోలు పొటాష్ వేసుకోవాలి.20:20:0కాంప్లెక్స్ వేసేవారు 100కిలోలు 20:20:0,15 కిలోలు పొటాష్ వాడాలి. 14:35:14 వాడే రైతులు 50కిలోలు 14:35:14 ,యూరియా 20 కిలోలు వేసుకోవాలి. తక్కువ ధరకు లభించే ఎరువులను రైతులు వేసుకుంటే మంచిదని సూచించారు.

## భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు

నగరి, నవంబరు 17 ప్రభాతవార్త:



పట్టణ పరిధిలో నాగులచవితి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. శివాలయాలు, నాగదేవత ఆలయాలు భక్తులతో కిక్కిరిసింది. ఓంశక్తి ఆలయం సమీపం గల నాగదేవత ఆలయంలో స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. బాలాజీ గోల్డెన్ సిటీలోని వరసిద్ధి వినాయక రాహు, కేతు శక్తి నాగాలమ్మ ఆలయంలో ఉదయం నుంచే మహిళల సందడి కనిపించింది. దేశమ్మ దేవాలయంలోని నాగదేవత ప్రతిమకు అభిషేకం చేసి పసుపు కుంకుమలు అద్ది కర్పూర హారతులు ఇచ్చారు. సాంప్రదాయం ప్రకారం నాగదేవత ప్రతిమల చుట్టూ రక్షా బంధనాలు చుట్టారు.

## శ్రీ నాగాలమ్మ చల్లగా దీవించమ్మా

పుత్తూరురూరల్, నవంబరు 17 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణం మండల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో నాగుల చవితి సందర్భంగా నాగాలమ్మ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడింది. పట్టణంలోని రైల్వే క్వార్టర్స్ సమీపంలోని శ్రీ నాగాలమ్మ దేవాలయంలో శుక్రవారం ఉదయం విఘ్నేశ్వర పూజ కలశ స్థాపన గణపతి హోమం నవగ్రహ శాంతి నవగ్రహ హోమం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామిశ్రీ మానస దేవి శ్రీ సుబ్రహ్మణ్యస్వామి శ్రీ నాగాలమ్మకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఆరేటమ్మ ఆలయ సమీపంలోని నాగాలమ్మ దేవాలయం మార్కెట్ యార్డు సమీపం శ్రీ కావమ్మ మారయ్య ఆలయం వద్ద వెలసిన నాగాలమ్మ ఆలయాల వద్ద భక్తులు పూజలు చేశారు.

## నగరి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ హరిబాబు

పుత్తూరురూరల్, నవంబరు 17 ప్రభాతవార్త:



బీజేపీ నగరి అసెంబ్లీ కన్వీనర్‌గా పుత్తూరుకు చెందిన సీనియర్ నాయకులు కె.ఎన్.హరిబాబు, కో-కన్వీనర్‌గా వడమాలపేట మండలం ఎస్వీ పురం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంరాజును నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి శుక్రవారం నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ నియోజక వర్గంలో పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు, చిలకు ఈశ్వర్‌ప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వీరి నియామకం పట్ల ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కోట కొండ బాబు, ఆవన్ జిల్లా గౌరవాధ్యక్షుడుమేకలసుబ్రహ్మణ్యం, వీవర్స్ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎంఏ నూతన కమిటి ఎన్నిక

తిరుపతి టౌన్,నవంబర్ 17 ప్రభాతవార్త :



వైద్య రంగంలో వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విశేషంగా కృషి చేస్తుందని తిరుపతి శాఖ అధ్యక్షులు, కార్యదర్శు లు పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతిలోని ఎమ్మెల్సీ కార్యాలయాంలో నూతన కమిటిని ఎన్నుకోవడం జరిగింది. ఆమేరకు కమిటిని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం సన్మానించారు. అధ్యక్షులుగా జనార్దన్ , కార్యదర్శులుగా వెంకటరమణ, కోశాధికారి, కృష్ణ కాంత్, ఉపాధ్యాక్షులు ఆరు మందిని సహాయ కార్యదర్శిలుగా 12 మందిని ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికొన్నారు. ఈ నూతన కమిటి రెండేళ్ల పదవి కాలం ఉంటుంది. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యాక్షులుగా డాక్టర్, శ్రీహరి, డా,హరికృష్ణ, డా.వెంకటేష్, ఉపాధ్యాక్షులు రెడ్డిప్ప,తదితరులు పాల్గొన్నారు.

## రౌడి షీటర్...కబ్జా చేయాలని చూస్తున్నారు!

తిరుపతి,నవంబర్ 17 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తి,పానగల్, మిట్టకండ్రిగలో తమ పిత్రార్జితమైన భూమిపై రౌడీ షీటర్ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆభూమికి తామే వారసుమని బాబురావు, మోమన్‌రావు, కార్తీక్‌లు స్పష్టం చేశారు. ఆమేరకు శుక్రవారం వారు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిని విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆభూమికి సంబంధించిన ఒరిజనల్ డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. వైసిపి జైకృష్ణ చేసిన ఆరోపణలు నిరాధామని వారు కొట్టేపారేశారు.

## మరమ్మతులకు నోచుకోని సరిహద్దు రోడ్డు

సత్యవేడు, నవంబర్ 17, ప్రభాతవార్త :

మూడేళ్ళకు పైగా రోడ్లు మరమ్మతులు విషయంపై పట్టించుకునే దిక్కులేకపోవడంతో గ్రామీణ వాసులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ప్రధానంగా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న రోడ్లు అధ్వానంగా మారింది. ప్రభుత్వం దృష్టికి పలుమార్లు సమస్యను తీసుకెళ్ళిన ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని గొల్లపాలెం- పాలగుంట రోడ్డు దుస్థితికి చేరింది. ఈకారణంగా ఆంధ్రా-తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు కూడా ఎక్కువగా ఈరోడ్డు మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డుకు మరమ్మత్తులు లేకపోవడంతో మోకాలు లోతు గుంతలలో ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురౌతున్న పరిస్థితి ఉంది. వర్షాకాలంలో ఇటు వైపు ప్రయాణించే ద్విచక్రవాహన దారులు అనేక మంది రోడ్డుమీద ఉన్న గుంతలు తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇరుగుళం, పాలగుంట, రాచపాళ్యెం, గొల్లపాలెం నుంచి అనేక మంది ఈరోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇటువైపుగా ప్రయాణిస్తూ గుంతల్లో పడి కాలు, చేయి విరిగి పుత్తూరు కట్టు కట్టుకుని నెలల తరబడి ఇంటివద్దే ఉంటూ ఇబ్బందులు పడుతున్న వారు లేకపోలేదు. స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం, సంబంధిత అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

## వైభవోపేతంగా శ్రీబాల నాగాలమ్మ గ్రామోత్సవం

సత్యవేడు, నవంబర్ 17 ప్రభాతవార్త



సత్యవేడు గ్రామంలో వెలసిఉన్న శ్రీబాల నాగాలమ్మ ఆలయంలో నాగుల చవితి పర్వదిన పూజా కార్యక్రమాలను శుక్రువారం వైభవంగా నిర్వహించారు. ఉదయకాల అభిషేకములతో శ్రీబాల నాగాలమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి దూపదీప నైవేద్యములను నివేదించారు. సాయంత్రం శ్రీబాల నాగాలమ్మ అమ్మవారి ఉత్సవవిగ్రహమును విశేషపుష్పములతో అలంకరించి పట్టణపురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ శాశ్వత ధర్మకర్త శ్రీమతి పి. రేవతమ్మ మాట్లాడుతూ ప్రతి యేడాది అమ్మవారి ఉత్సవములను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్న సంప్రాదా యంగా పేర్కొన్నారు.

## అయ్యప్పస్వామి భక్తులకు అన్నదానం

తొట్టంబేడు, నవంబర్ 17 ప్రభాతవార్త :



మండలంలోని పొయ్య గ్రామంలో ఎంపిపి ఉన్నంనిర్మల, మండల కన్వీనర్ ఉన్నంవాసుదేవనాయుడులు వారి నివాసంలో ప్రతి ఏడాది అయ్యప్పస్వామి మొక్కుబడి సందర్భంగా ప్రతి ఏడాది అన్నదానం నిర్వహించడం ఆనవాయితీ. ఈనేపథ్యంలో ముందుగా అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించి సుమారు వందమందికి పైగా అయ్యమాల ధరించిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సాయిచరణ్ తదితరులతో పాటు పలువురు అయ్యప్పభక్తులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## బెస్ట్ యంగ్ ఫ్యాకల్టీ అవార్డు అందుకున్న డాక్టర్ ఎన్.బాలసుబ్రమణ్యం

తిరుపతి (క్రీడా), నవంబర్ 17 ప్రభాతవార్త :



శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అకాడమీ కన్సల్టెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ ఎన్. బాలసుబ్రమణ్యంకు నోవెల్ రీసెర్చ్ అకాడమీ, పుదుచ్చేరి వారిచే బెస్ట్ యంగ్ ఫ్యాకల్టీ అవార్డు 2023 - 24గాను అందుకున్నారు. ఇతను కర్ణాటకలోని బెంగళూరు విశ్వవిద్యాలయం నుండి తన పీహెచ్‌డి అందుకున్నారు. ప్రఖ్యాత అంతర్జాతీయ జర్నల్స్‌లో దాదాపు 16 పరిశోధన పత్రాలను, 2 పుస్తకాలనుప్రచురించడం జరిగింది. ప్రస్తుతం సిరామిక్ టెక్నాలజీలో తన పరిశోధనను కొనసాగిస్తున్నారు.

## జిల్లా జూడో పోటీలు ప్రారంభం

తిరుపతి (క్రీడా), నవంబర్ 17 ప్రభాతవార్త :



తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 గంటలకు సంయుక్త చిత్తూరు జిల్లా సబ్ జూనియర్ జూడో పోటీలను జెన్ అకాడమి అండ్ జూడో సంఘం ఉపాధ్యక్షులు భానుప్రకాష్ రెడ్డి, తిరుపతి జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీధర్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏఓ సయ్యద్, సామాజిక వేత్తలు మున్నారెడ్డి, హర్ష వర్దన్‌లు ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుండి 120 మంది బాలబాలికలు పాల్గొన్నారు. జిల్లా జట్టు ఎంపికను డిఎస్ఏ కోచ్ గోపి, పిడి చంద్రశేఖర్ రాజు, పిఈటి ఉదయకుమారి, ప్రతాప్, గుణల పర్యవేక్షణలో జరిగింది. ఫైనల్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుకు జెన్ అకాడమి, జిల్లా జూడో సంఘం అధ్యక్షులు రాజేష్, డాలర్స్ గ్రూప్ అధినేత దివాకర్ రెడ్డిల సహకారంతో క్యాంప్ నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని జిల్లా జూడో సంఘం కార్యదర్శి కిరణ్ కుమార్ తెలిపారు.

## ప్రవేశ పరీక్షకై విశ్వంలో ఉచిత అవగాహన సదస్సు

తిరుపతి (క్రీడా), నవంబర్ 17 ప్రభాతవార్త :

స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్‌లో ఈ నెల 19వ తేది ఆదివారం ఉదయం 9 గంటలకు సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్‌లో 2024 విద్యా సంవత్సరంలో జాతీయ స్థాయిలో జరగబోవు ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత అవగాహన సదస్సు నిర్వహించబడునని కోచింగ్ ఫెడరేషన్‌ఆఫ్‌ఇండియారాష్ట్రఉపాధ్యక్షులు,విశ్వంవిద్యాసంస్థలఅధినేతడా.ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలియజేసారు. మరిన్నివివరాలకు9399976999,8688888802 నెంబర్‌లకు సంప్రదించవచ్చు నని తెలిపారు.

## వారోత్సవాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నారాయణవనం, నవంబర్ 17 ప్రభాతవార్త :



56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ కె సులోచన, గ్రంథాలయ అధికారి జీవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పద్మావతీ అమ్మవారికి ఘనంగా ఊంజల్‌సేవ

నారాయణవనం, నవంబర్ 17 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## జగనన్నకు చెబుతాం కార్యక్రమంలో సమస్యలపై అర్జీలు వెల్లువ..!

నారాయణవనం, నవంబర్ 17 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణ వనం మేజర్ పంచాయతీ తాతా సొరకాయలస్వామి కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 11గంటలకు జగనన్నకు చెబుతాం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తీ ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి, డిఎల్‌డిఓ ఆదిశేషారెడ్డిలు ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమానికి 19 పంచాయతీల నుంచి ప్రజలు అర్జీలను తమ వెంట తెచ్చుకొని సంబందిత అధికారులకు అందించారు. బాధితులు ఇచ్చిన ఆర్జీలను క్షణంగా పరిశీలించిన అధికారులు కొన్నింటిని పరిష్కరించారు. మరికొన్నింటిని ఉన్నత అధికారులతో మాట్లాడి పరిస్కరించడానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అర్‌డబ్లుఎస్ డిఇఇ దామోదరంనాయుడు, పిఆర్ డిఇఇ మదుసూధన్, ఎంపిడిఓ కృష్ణమూర్తి, తహశీల్దారు ప్రమీళ, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, డాక్టర్ దర్శిత్‌రాజ్, కుమార్, భార్గవి, వెలులు ఎపిఎం మమత, ఇజిఎస్ ఎపిఓ సుకన్య, ఎఇఇలు ప్రకాష్‌బాబు, మలర్, హేమాద్రి, ఇఓపిఆర్‌డి డాక్టర్ వేణయ్య, పంచాయ తీ ఇఓ షణ్ముగం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బేబి, సిసిలు, సచివాలయం సిబ్బంది, అందరు పాల్గొన్నారు.

## గ్రామీణులకు అందుబాటులో కార్గో సేవలు

వడమాలపేట, నవంబరు 17 ప్రభాతవార్త:



రోడ్డు రవాణా సంస్థ ప్రారంభించిన కార్గో సేవలు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.ఎస్.ప్రశాంతి తెలిపారు. కార్గో సేవలపై శుక్రవారం వడమాలపేట ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం మండల కేంద్రాల్లో ఏజెన్సీల ద్వారా కార్గో డెలివరీ సేవలు విస్తృతంగా అందజేస్తున్నట్లు తెలిపారు. తక్కువ చార్జీలతో సకాలంలో మీపార్సల్ సురక్షితంగా మీ ఇంటి వద్దకే చేర్చబడుతుందన్నారు. గ్రామాల్లో సైతం ఏజెంట్లకు అవకాశం కల్పిస్తున్నామని, ముఖ్యంగా గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లి ఉద్యోగులుగా స్థిరపడ్డ వారు తమ కుటుంబాలకు పంపే పార్సలను కార్గో ద్వారా పంపాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ పెరుమాళ్, స్థానికులు పాల్గొన్నారు.

## సంస్కృతులకు పుట్టినిల్లు భారతదేశం.: శ్రీముఖి

రేణిగుంట, నవంబరు 17 ప్రభాతవార్త:



ప్రాచీన సంస్కృతులకు, పవిత్ర గ్రంథాలకు భారతదేశం పుట్టినిల్లని రేణిగుంట గ్రంథాలయ అధికారి శ్రీముఖి అన్నారు. జాతీయ 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో పిల్లలకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు రోజు బహుమతులు అందజేస్తామని శ్రీముఖి తెలిపారు. వాల్మీకి, వేదవ్యాసుడు, నన్నయ్య, తిక్కన, ఎర్రప్రగడ, బమ్మెర పోతన, తిరుపతి వెంకటవులు, మొల్ల, రంగనాథుడు, వేమన, కబీర్ దాసు, తులసిదాసు, త్యాగరాజు, అన్నమాచార్యులు లాంటి తెలుగు, సంస్కృత, హింది, తదితర భాషల కవులు, వాగ్గేయకారుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

## సీబీఐడీ కాలనీలో బొజ్జల పర్యటన

రేణిగుంట, నవంబరు 17 ప్రభాతవార్త:



రేణిగుంట పట్టణం సీబీఐడీ కాలనీలో శుక్రవారం శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. రేణిగుంటను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, రేణిగుంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ పార్టీ సీనియర్ నేతలు డి.పుష్పనాథం, మునస్వామినాయుడు, బుజ్జినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు కాపాడండి

తిరుపతి.నవంబర్ 17 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తిలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని శ్రీకాళహస్తి తెదేపా ఇన్‌చార్జీ, తెదేపా అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మీడియా తో మాట్లాడారు. వాస్తవాలను మీడియా అయిన వెలుగులోకి తీసకొరావాలని ఆయన అభ్యర్థించారు.

## రుద్రపాదాల వద్ద వేడుకగా నాగుల చవితి

శ్రీకాళహస్తి,నవంబర్ 17 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం నాగుల చవితి పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ ఏడాది నాగుల చవితి శుక్రవారం రావటంతో విశిష్టత చోటు చేసుకుంది.ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తూ ఏర్పాట్లను భక్తుల మనోభావాలకు అనుగుణంగా చేస్తున్నారు. దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన సామూహిక కేదారగౌరీ వ్రతం సందర్భంగా సమీక్షలోనే నాగుల చవితి ఏర్పాట్లును సమీక్షించారు. సిబ్బందికి దిశ దెశ నిర్దేశం చేసారు. శుక్రవారం ఉదయం నుంచి సన్నిధివీధిలోని రుద్రపాదాల చెంత వెలసిన నాగశిలల వద్ద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.ఇక్కడ నాగశిలలకు షోడషాభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వారి సహచరులు వచ్చిన భక్తులకు సదుపాయాలు పర్య వేక్షించారు. ఇక్కడ శిలలకు చక్కగా పూలతో అలంకరించారు.ఈ సందర్భంగా అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ స్వామి వారికి ఇష్టమైన నువ్వులు,చిమ్మీలు, సద్దలు,పాలు,అన్నంతో నైవేద్యం సమర్పించారు. దివ్యక్షేత్రంలోని ప్రజలు, రైతులు, కార్మికులు,కర్షకులు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో విరాలజిల్లాలని పూజలు నిర్వహించినట్లు వివరించారు.ఈ కార్యక్రమాల్లో చైర్మెన్‌తో పాటు సభ్యులు కొండూరు సునీత,రమాప్రభ, చెంచులత ఆలయ ఇన్సె పెక్టర్ సుదర్శనం నాయుడు, ఆలయ ప్రధానార్చ కులు కరుణాకర్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి, అంజనేయ శర్మ,పరిచారకులు గోవింద్‌శర్మ, పాల్గొన్నారు.

## పూజలు చేయించుకున్న తిరుపతి కమిషనర్

శ్రీకాళహస్తి,నవంబర్ 17 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహిమాన్వితమైన రాహుకేతుదోష నివారణ పూజలను అతిధులు ప్రాధాన్యత ఇస్తున్నారు.ఈ నేపథ్యంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత కుటుంబసభ్యులతో విచ్చేసారు. ఆమెకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ధర్మకర్తల మండలి సభ్యుడు బుల్లెట్ శ్యాంరాయల్ స్వాగతించారు. ఆలయ ఎఇఒ సతీష్‌మాలిక్ పర్యవేక్షించారు. సహస్రలింగేశ్వ రుని ఆలయం వద్ద ప్రత్యేక టిక్కెట్లు కొనుగోలు చేసి పూజలు జరిపించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయం దర్శనం ఏర్పాటు చేసారు.గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులచే ఆశీర్వదించారు.

## కార్తీకమాసం ఆచారాలను పొందుపరచిన త్వాత్విక రహస్య ప్రకాశం

శ్రీకాళహస్తి,నవంబర్ 17 ప్రభాతవార్త :




ఒక్కొక్క మాసం ఒక్కొక్క అంశానికి ప్రధాన్యత. కార్తీక మాసం భక్తిభావానికి నిదర్శనం.అయితే ఈ మాసం ఆచరించాల్సిన విధి విధానాలు శివాలయంలో ఆచరించాల్సి న అంశాలను సమగ్రంగా పొందుపరచిన 'శ్రీకాళహస్తీశ్వర తాత్విక రహస్యప్రకాశం అనే' పుస్తకం ఆలయంలోని పబ్లికేషన్స్ కౌంటర్లలో ఈ నెల 20 నుంచి అందు బాటులో ఉంటుందని ప్రకాశకులు పి.దొరస్వామిరెడ్డి శుక్రవారం తెలిపారు.ఈ గ్రంథంలో భారతీయ సంప్రదాయాలు, సంస్కృతి, దేవాలయ సంప్రదాయాలు, ఆచారాలను చక్కగా విశదీకరించారు. మానవుడు భక్తి పూర్వకంగా సాధించాల్సింది ఏమిటి? అనే అంశానికి సంబంధించి వేదాంతార్గతమైన విశ్లేషణలను ఇందులో పేర్కొనబడి ఉంది. ఈశోపనిషత్తు, కఠోపనిషత్తు, ముండుకోపనిషత్తు,కేశోపనిషత్తు, ప్రశ్నోపనిషత్తు, కేనోపనిషత్తు, ఇలా 9 ఉపనిషత్తులకు సంబంధించిన అంశాలను ఉపయోగకరంగా ఉండే విధంగా రూపొందించారు.ఈ గ్రంధాలను ఈ నెల 20 నుంచి అందుబాటులోకి తీసుకురావటానికి ప్రయత్నిస్తున్నట్లు వివరించారు.

## గ్రంధాలయాలు జ్ఞాన నిలయాలు:ఎటిఎస్

శ్రీకాళహస్తి,నవంబర్ 17 ప్రభాతవార్త :



గ్రంధాలయాలు జ్ఞాన నిలయాలని, పుస్తక భాండాగారాలని శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు.శుక్రవారం ఆయన గ్రంథాలయ వారోత్సవాలకు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ దినోత్సవాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వారోత్సవాలుగా నిర్వహించాలని ప్రతి ఒక్కరికి గ్రంథాలయాల మీద అవగాహన అక్కడి విజ్ఞానాన్ని ఆస్వాదించాలనే బావం కలగాలన్నారు. శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి చొరవతో పంచాయతీరాజ్ అతిథి గృహం వద్ద సొంత భవనాలు డిజిటల్ లైబ్రరీ నిర్మాణం చేపట్టారన్నారు.ఈ సందర్భంగా కవిసమ్మేళనం నిర్వహించారు. కవులు మునిసుబ్బారెడ్డి, అనందయ్య, గురునాధంలు తమ కవిత్వంలో పుస్తకాల్ని చదవటం వల్ల వచ్చే లాభాలను భాషపై పట్టును వివరించారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిదిగా విచ్చేసిన శ్రీనివాసులును దుశ్శాలువతో సత్కరించారు.సమావేశానికి గ్రంధాలయాధికారి లావణ్య మాట్లాడుతూ పుణ్యక్షేత్రంలో గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించుటకు ప్రణాళిక రూపొందించగా అన్ని వర్గాల నుంచి విద్యార్థుల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు.రాబోవు రోజుల్లో గ్రంథాలయంలో మరెన్నో సాహితీ పుస్తకాలు అందుబాటులో తీసుకురావటానికి త్వరలోనే కొత్త భవనాల్లోకి మార్చబడుతుందని వివరించారు. గ్రంథాలయ అభివృద్ధికి సహకరిస్తున్న ఎంఎల్ఏ మధుసూధనరెడ్డి అభినందనీయులన్నారు.ఈ కార్యక్రమాల్లో ఆమెతో పాటు తొట్టంబేడు గ్రంధాలయాధికారి హరికృష్ణ,రిటైర్డ్ గ్రంథాలయాధికారి చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోను లాభాల బాటలోకి తీసుకురావాలి

– తిరుపతి జిల్లా రీజనల్ మేనేజర్ చెంగల్‌రెడ్డి

సూళ్లూరుపేట, నవంబర్ 17 ప్రభాతవార్త :



...ందుకు ప్రతి ఒక్కరు సమన్వయంతో ...ర్రు. శుక్రవారం ఆయన స్థానిక డిపోను ...టలో ఉన్నందున బస్సులను సక్రమంగా ... సమయపాలన పాటిస్తే నష్టాలను ...ర్ బస్సులు నిలిపేసి డిపో ఆధ్వర్యంలో ...లివరి గురించి ప్రయాణికులకు వివరించి ...ల 21వ తేదీన జరగనున్న ముఖ్యమంత్రి ...లను ఏర్పాటు చేస్తున్నామని, వీటిని సద్వినియోగం చెసుకోవాలని,దీనికి తగ్గట్టుగా ప్రణాళిక రూపొందించాలని డిపో మేనేజర్ మల్లికార్జునకు చెంగల్‌రెడ్డి సూచించారు. అనంతరం కెఎంపిఎల్ సాధించిన మెకానిక్ జనార్ధన్‌కి, డ్రైవర్ పివి కృష్ణయ్య, కండక్టర్ శివలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు తిరుపతి జిల్లా ప్రెసిడెంట్ ఎం.శేఖర్, సిపిఎం భాస్కర్‌రెడ్డి, మూర్తి, రఫి, కల్యాణ్ కృష్ణయ్య, పోలయ్య, ఎ.సుబ్రహ్మణ్యం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోటి దీపోత్సవంలో పాల్గొన్న శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్

శ్రీకాళహస్తి, నవంబర్ 17 ప్రభాతవార్త



తెలంగాణా రాష్ట్రం హైదరాబాదులోని ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీక్రవారం నిర్వహించిన కోటి దీపోత్సవం కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం తరపున రాహుకేతు దోష పూజలు మరియు జ్ఞానప్రసూనాంబ అమ్మవారు, శ్రీకాళహస్తీశ్వరస్వామి కళ్యాణోత్సవ కార్యక్రమానికి హజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ పవిత్ర కార్తీకమాసం సందర్భంగా నాగులచవితి సందర్భంగా భక్తి ఛానల్ మరియు ఎన్‌టివి సారథ్యంలో నిర్వహించిన కోటి దీపోత్సవ కార్యక్రమానికి హజరవడం తన అదృష్టమన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ఎసి మల్లికార్జున్ ప్రసాద్, అర్చకులు, వేదపండితులు మరియు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## నిన్నటి వరకు చెత్తకుప్పలు - నేడు పూల మొక్కలతో కళకళ

చిత్తూరు, నవంబర్ 17 ప్రభాతవార్త:



నిన్నటి వరకు చెత్త కుప్పలతో అపరిశుభ్ర ప్రాంతంగా మారిన ప్రదేశం ప్రస్తుతం పూల మొక్కలతో కళకళలాడుతుంది. చిత్తూరు నగర పరిధిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా వ్యర్థాలతో నిండిన ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేసి ఆ ప్రాంతాల్లో పచ్చదనం నింపే కార్యక్రమాలకు మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 34వ డివిజన్‌లోని ఆర్టీసీ డిపో రోడ్డు వ్యర్థాలతో నిండి కంపును తలపించేలా మారింది. ఈ ప్రాంతంను ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు గుర్తించి పరిశుభ్రం చేశారు. ఇలా శుభ్రం చేసిన ప్రాంతంలో మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ శుక్రవారం పూలమొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ వీధులు, నివాస ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా వ్యర్థాలు వేయరాదని, వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. నగర పరిధిలోని అన్ని డివిజన్లలో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మొక్కలు నాటిన ప్రాంతాల్లో మళ్ళీ వ్యర్థాలు వేయరాదని, బోర్డులు ఏర్పాటు చేయాలని, రోజు పర్యవేక్షించాలని కమీషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఒ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ చిన్నయ్య, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

## చిత్తూరుకు చేరిన అయోధ్యరాముని అక్షింతలు

చిత్తూరురూరల్, నవంబరు 17 ప్రభాతవార్త:



దేశంలోని ప్రతి హిందు కుటుంబానికి అయోధ్యలోని బాలరాముని పూజలో ఉపయోగించిన అక్షింతలు, రామాలయ చిత్రపటము చేర్చాలని శ్రీరామజన్మభూమి తీర్థ ట్రస్ట్ నిర్ణయించింది. ఈ క్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం అక్షింతలు, రామాలయ చిత్రపటము నగరానికి చేరగా విశ్వహిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ, భారతీయజనతా పార్టీ, సమరసత ఫౌండేషన్ వివిధ దార్మిక సంస్థలు రైల్వేస్టేషన్ నుంచి మేళతాళాలతో పురవీధుల గుండా జగజాగరణ చేస్తూ శ్రీ కోదండరామస్వామి దేవస్థానంకు చేర్చారు. అనంతరం పూజాధి కార్యక్రమాలు నిర్వహించి భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ సేవకులు హరిబాబు, వేలు, బిజెపి చిట్టిబాబు, రామభద్ర, తోటపాళ్యం వెంకటేష్, జయచంద్ర, జయకుమార్, రామమూర్తి, కొత్తూరుబాబు తదితరులు పాల్గొన్నారు.

## అశ్వవాహనంపై "సిరులతల్లి"

తిరుపతి/తిరుచానూరు,నవంబర్17ప్రభాతవార్త:

తిరుచానూరు పద్మావతిఅమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరగా శుక్రవారం రాత్రి అశ్వవాహనంపై సిరులతల్లి దర్శనమిచ్చారు. కల్కిమూర్తియై గుర్రంపై పయనిస్తూ ,ఖడ్గధారియై దుష్టశిక్షణం, శిష్టరక్షణం చేస్తానని పురాణాలు పేర్కొన్నాయి.

## నాగులచవితిరోజు

పెద్దశేషునిపై ఏడుకొండలవాడు

తిరుమల,నవంబర్ 17 ప్రభాతవార్తప్రతినిధి:

కార్తీకమాసంలో విశేషమైన నాగులచవితి పర్వదినాన ,.శుక్రవారం సాయంత్రం మలయప్పస్వామి ఏడుతలల పెద్దశేషుని వాహనంగా చేసుకుని ఊరేగారు. భక్తులు కర్పూర హారతులిచ్చి గోవిందా గోవింద నామంతో స్వామివారిని వేడుకున్నారు.

## అమ్మవారి రథోత్సవానికి...బంగారుగొడుగు ఊరేగింపు



తిరుమల,నవంబర్ 17 ప్రభాతవార్తప్రతినిధి: తిరుచానూరులో కన్నుల పండువగా సాగుతున్న పద్మావతిఅమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం రథోత్సవానికి అలంకరించే బంగారుగొడుగు ఊరేగింపు జరిగింది. తిరుమల కల్యాణకట్టనుండి వేదపండితులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అధికారులు, కళ్యాణకట్ట మిరాశీదారులు పంతులుగారి రామనాథమ్ ఆద్వర్యంలో శాస్త్రోక్తంగా ఊరేగింపులో,టిటిడి బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు పావులూరి రవీంద్రబాబు, గంగారాజ్ కుమార్ యాదవ్, ఏ.కామరాజు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంగారుగొడుగును తిరుచానూరుకు చేర్చారు.

## "శ్రీనివాస దివ్యానుగ్రహ విశేషహోమం"కు విచ్చేయండి

-టిటిడి చైర్మన్ భూమనకు పండితుల ఆహ్వానం



తిరుమల,నవంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి: లోక కల్యాణంకోసం హిందూ సనాతన ధర్మప్రచారంలో భాగంగా అలిపిరిలోని సప్తగోప్రదక్షిణ మందిరంలో 23వతేదీ ఉదయం 9గంటలకు నిర్వహించ తలపెట్టిన శ్రీనివాస దివ్యానుగ్రహ విశేషహోమంకు విచ్చేయాలని టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని ఆహ్వానించారు. శుక్రవారం సాయంత్రం పద్మావతిపురంలోని ఆయన నివాసంలో ఎస్వీవేదవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణిసదాశివమూర్తి , వేదపండితులు హాజరై ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వేదాశీర్వచనం చేశారు.

## 26న యోగుల పర్వతంపై...

అఖండదీపోత్సవ మహోత్సవం

–1,503కిలోల ఆవునెయ్యి వినియోగం

తిరుపతి,నవంబర్ 17ప్రభాతవార్త:



పవిత్రమైన కార్తీకమాసంలో కార్తీకపౌర్ణమి దీపోత్సవం ఈనెల 26వతేదీ ఆదివారం "యోగులపర్వతం"పై అఖండదీపో త్సవం వెలిగిస్తున్నట్లు ఏకవీర ఫౌండేషన్ నిర్వాహకుడు ప్రతాప్‌స్వామి తెలిపారు. ఈ అఖండదీపోత్సవంలో 1,503కిలోల ఆవునెయ్యి, ఆరు అడుగుల కొప్పెరతో 2007 మీటర్ల వొత్తులతో ప్రజలకు దివ్యవెలుగు నివ్వనుందన్నారు. భక్తులు యోగుల పర్వతానికి కుప్పంబాదూరునుండి పుత్తూరు రోడ్డు, కమ్మపల్లినుండి అప్పలాయగుంటరోడ్డులో చేరుకోవాలన్నారు. 26వతేదీ గోపూజలు, జ్ఞాన కుమారస్వామికి రుద్రాభిషేకాలు, సిద్దేశ్వరస్వామికి మంగళహారతులు, ఓంకార నాదంతో భజనలు జరుగుతాయన్నారు. అఖండ దీపోత్సవం పురస్కరించుకుని శుక్రవారం తిరుపతిలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏకవీర ఫౌండేషన్ నిర్వాహకుడు ప్రతాప్‌స్వామి, రాయలసీమ రంగస్థలి కళాసంస్థ చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కెఎన్ రాజ, సుబ్రమణ్యంరెడ్డి, విజయకుమార్, అక్కిపల్లి మునికృష్ణయ్యయాదవ్, వెంకటేష్, కస్పా పద్మనాభమ్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా అమ్మవారి తిరుచ్చివాహనసేవ

శ్రీకాళహస్తి, నవంబర్ 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి శుక్రవారం రాత్రి స్వామి అమ్మవార్ల దీపారాధన అనంతరం అమ్మవారి ఆలయం వెలుపల ఉన్న మండపంలో ఉన్న అమ్మవారి ఉత్సవ మూర్తి జ్ఞానప్రసూనాంబికాదేవిని ఆలయంలోని అలంకార మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చివాహనంపై కొలువుదీర్చి వేదమంత్రాలు, మంగళవాయిద్యాలనడుమ అమ్మవారికి ఆలయ ప్రాకారోత్సవం, తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేకహారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వరప్రసాదరావు సుడిగాలి పర్యటన

కోట, నవంబర్ 17 ప్రభాతవార్త :



గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు కోట మండలంలోని కేశవరం పంచాయతీలో శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వరప్రసాదరావు కేశవరంలో బసచేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు గురుస్వామి, చిట్టేడు సొసైటీ మాజీ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్‌లు పంచాయతీలోని పలు ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం ఉదయం 6 గంటలకే కాలి నడకన కేశవరం నుంచి సిద్ధమ్మకండ్రిగ గ్రామానికి 4 కిలోమీటర్లు నడిచి రోడ్డుమార్గాన వెళ్లారు. ఈ సందర్భంగా రోడ్డుపై వచ్చే ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ ప్రశ్నించడం కనిపించింది. పొలాల్లోని గెనాలపై వెళ్లి రైతులను ఆప్యాయంగా పలకరించారు. 20 ఏళ్ల యువకుడిలాగా ఆయన పొలాల్లో గెనాలపై చకచకా నడిచి వెళ్లడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అక్కడ నుంచి రాఘవాపురం, తణుకుమాలకు వెళ్లే మార్గం మధ్యలో వంతెన ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని చూసి చలించిపోయారు. వెంటనే కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## పుంగనూరు ప్రజలకు అండగా ఉంటా

-ఎన్.వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు,నవంబర్ 17 ప్రభాతవార్త :



నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని,ప్రజాసేవకు తన ట్రస్టు అంకితభావంతో పనిచేస్తోందని ఎన్వీర్ ట్రస్టు వ్యవస్థాపకులు,నిర్మాణవేత్త డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ప్రజలతో మమేకం కార్యక్రమంలో భాగంగా ఆయన నానాసాహెబ్‌పేటలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.8.5లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసేవలో ఉన్న తాను రాజకీయాల లోనికి రావాలని ప్రజలు పట్టుబడుతున్నారన్నారు. ఏపార్టీలో ఉండాలన్న విషయాన్ని ప్రజల సూచనలమేరకు నిర్ణయించడానికి ప్రజలతో మమేకం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తన పర్యటనలో రెండోదశలో భాగంగా తనకు అత్యంత ఆదరణతో స్వాగతం పలికిన ప్రజల కోరిక మేరకు విరాళాన్ని ప్రకటించామన్నారు. కులమతవర్గవిబేధం లేకుండా విద్యా,వైద్య,ఆధ్యాత్మిక సేవలందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శి శివకుమార్,సభ్యులు పాల్గొన్నారు.

## పెంటపాడు గ్రామంలో స్థానికుల ఆందోళన

చిల్లకూరు, నవంబర్ 17 ప్రభాతవార్త :



పెంటపాడు రెవెన్యూ పరిధిలోని వ్యవసాయ పొలాలకు అడ్డుగా కంచె వేసి దారి లేకుండా చేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేసారు. గిరిజనులు చేపల వేటకు చెరువకు వెళ్లాలన్నా పశువులను మేతకు తోలుకువెళ్లాలన్నా దారి లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేసారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆక్రమణదారులకు అధికారులు అండగా నిలుస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అదే విధంగా కొంత మంది భూస్వాములు ప్రైవేట్ వ్యక్తులు ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేసి కాలిబాటలను ఆక్రమణకు గురి చేసే ముళ్ల కంచె ఏర్పాటు చేసి ఉన్నారన్నారు. వాషర్ మాన్ గుంట, వరవ కాలువ, త్రాగునీటి భావి వద్దకి రైతులు పొలాల్లోకి వెళ్లాలంటే త్రీవ ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు.

## సిఎం స్థాయిలో వెంకటగిరిని నేదురుమల్లి అభివృద్ధి చేయలేదు

వెంకటగిరి, నవంబర్ 17 ప్రభాతవార్త :




వెంకటగిరి నియోజకవర్గంలో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి సిఎంగా ఉండగా ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేదని మాజీ ఏఎంసి చైర్మన్ పులికల్లు రాజేశ్వర రావు తెలిపారు. వెంకటగిరిలోని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాస గృహంలో టిడిపి నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారెంటీ బాబు షూరిటీ కార్యక్రమంలో స్థానికులు చెప్పిన సమస్యలపై మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తాను ఎంతో అభివృద్ధి చేశానని చెప్పడంతో వైసిపి నేతలు పలు రకాలుగా విమర్శించడం ఆశాస్పదమన్నారు. మాజీ సిఎం జనార్ధన్ రెడ్డి మంత్రిగా రాజ్యలక్ష్మి నియోజకవర్గంలో ఆశించిన మేర అభివృద్ధి చేయలేదన్నారు. పోలేరమ్మ జాతరను పురుగుల రామకృష్ణ ఎమ్మెల్యేగా ఉండగా వైభవంగా నిర్వహించేవారు అని తెలిపారు. రాష్ట్ర పండుగగా జాతరను చేశానని గొప్పలు చెప్పుకుంటున్నారని కురుగొండ్ల రామకృష్ణ దేశ స్థాయిలోగుర్తించే విధంగా జాతరను నిర్వహించారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ పై ఆరోపణలు చేయడం తగదన్నారు. సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కెవికె ప్రసాద నాయుడు, నాయకుఉల చెంగారావు, గంగాధర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల కోసం చేపట్టే దీక్షను జయప్రదం చేయండి : సిపిఐ

గూడూరు, నవంబర్ 17 ప్రభాతవార్త :



కరువుతో రాష్ట్రంలో రైతుల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20, 21వ తేదీ విజయవాడలో సిపిఐ ఆధ్వర్యంలో 30 గంటల దీక్ష కార్యక్రమం జరుగుతుందని గూడూరు సిపిఐ పట్టణ కార్యదర్శి సిసి వెల్లడించారు. గూడూరు పట్టణంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ జరిగే నిరసన దీక్ష గోడపత్రికలను విడుదల చేసారు. సిపిఐ పట్టణ కార్యదర్శి శశి మాట్లాడుతూ కరువుతో రాష్ట్రంలో రైతుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గత రెండు నెలల్లో నీరు పుష్కలంగా డ్యాముల్లో ఉన్నప్పుడు వృధాగా విడుదల చేశారని ఆవేదన వ్యక్తం చేసారు. కరువు నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20, 21వ తేదీల్లో విజయవాడలో జరిగే నిరసన దీక్షలో రైతులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి ఎంబేటి చంద్రయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు, హైదర్ అలీ, సురేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

## బిఎంసిల నిర్మాణాలు పూర్తికి చర్యలు : జాయింట్ కలెక్టర్

చిత్తూరు, నవంబర్ 17 ప్రభాతవార్త:



త్వరితంగా ప్రారంభించాలని భావించిన ఎఎంసీలు, బిఎంసీల నిర్మాణాలను సత్వరం చేపట్టి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ ఆరు మండలాల్లో 103 పాల కేంద్రాలు ప్రారంభించాలని నిర్ణయించడం జరిగిందని ఈ మేరకు ఎద్దైనా పనులు పెండింగ్‌లో వుంటే సత్వరం పూర్తి చేయాలన్నారు. అలాగే బిఎంసియులకు సంబంధించి పనులు వేగవంతంగా పూర్తి చేసి అప్పగించాలన్నారు. అలాగే డిసెంబర్ నెలలో ప్రారంభించాలని భావించిన మరో 165 పాల కేంద్రాలకు సంబంధించిన పనులను వేగవంతం చేసి వాటిని పూర్తి చేయాలని, అలాగే వీటికి సంబంధించిన పనులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డెయిరీ డెవలప్‌మెంట్ అధికారి రవిచంద్రన్, డిసిఒ బ్రహ్మానందరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, సాంఘీక సంక్షేమశాఖ డిడి డాక్టర్ రాజ్యలక్ష్మి, డిఎల్‌డిఒ రవికుమార్, ఆమూల్ డెయిరీ ప్రతినిధి నవీన్ తదితరులు పాల్గొన్నారు.